

విదేశాల్లో మున్సిపల్ కౌన్సిలర్?

- సమావేశాలకు వస్తున్నట్లు దొంగ సంతకాలు
- అనర్హత నుంచి తప్పించుకునేందుకే...



సబ్‌కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో డీఏవోకు ఫిర్యాదు చేస్తున్న వాల్మీకి ధర్మసమాజ్ ప్రతినిధులు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలో ఆమె వైసీపీకి చెందిన ఓ కౌన్సిలర్. ఆమె ఎనిమిది నెలలుగా విదేశాలలో ఉంది. అయితే నెలనెలా జరిగే పాలక వర్గ సర్వసభ్య సమావేశాలకు మాత్రం ఆమె హాజరవుతూ ఉంది. ఇంతవరకు చదివితే.. అబ్బో.. తన వార్డు ప్రజల పట్ల, వార్డు సమస్యల పట్ల ఆమెకు ప్రేమో.. అనే అభిప్రాయం మనకు కలుగుతుంది. అయితే వాస్తవానికి అక్కడ జరుగుతున్నది చూస్తే.. ఔరా..! పదవి పోకుండా ఉండేందుకు వీళ్ల ఎంతకు తెగించారు? అని అర్థం అవుతుంది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె మునిసిపాలిటీ 17వ వార్డుకు ముబీనా ముబషీర్ వైసీపీ తరపున కౌన్సిలర్‌గా గెలిచారు. ఆమె గత సెప్టెంబరు నుంచి విదేశాలలో ఉన్నట్లు సమాచారం. అయితే గత శనివారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆమె హాజరైనట్టు ఎవరో బురఖా ధరించి వచ్చి సంతకం చేసి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు టీడీపీ కౌన్సిలర్లు ఆమెను బయట నిలదీయగా సమాధానం చెప్పకుండా ఉడాయించింది. సాధారణంగా మునిసిపాలిటీ కౌన్సిలర్ సరైన కారణాలు లేకుండా పాలకవర్గానికి ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా మూడు వరుస సమావేశాలకు హాజరు కాకుండా ఉండకూడదు. అలా జరిగితే ఆ కౌన్సిలర్‌కు మునిసిపల్ పాలకవర్గం నోటీసులు ఇచ్చి ఆ కౌన్సిలర్ సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. దీంతో ప్రస్తుతం విదేశాలలో ఉన్న సదరు కౌన్సిలర్ పదవిని కాపాడేందుకు గత సెప్టెంబరు నుంచి మునిసిపల్ సమావేశాలలో ఆ కౌన్సిలర్ హాజరవుతున్నట్లు కౌన్సిలర్ల హాజరు పట్టికలో సంతకాలు చేస్తున్నారు. అది కూడా ప్రతి సమావేశానికి హాజరైనట్లుగా కాకుండా వరసుగా రెండు సమావేశాల తర్వాత మూడవ సమావేశానికి హాజరవుతున్నట్లు సంతకాలు చేస్తున్నారు. ఒకేరోజు సర్వసభ్య సమావేశం, అత్యవసర సమావేశాలు జరిగితే అందులో ఏదో ఒక సమావేశానికి హాజరైనట్లు సంతకాలు చేస్తున్నారు దీనిని బట్టి చూస్తే.. ఆ కౌన్సిలర్ పదవిని కాపాడేందుకు ఎవరో హాజరు పట్టికలో సంతకాలు చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి కౌన్సిలర్లు హాజరైన రిజిస్టర్‌ను పరిశీలిస్తే గత ఏడాది అక్టోబరు, నవంబరులో జరిగిన మునిసిపల్ సమావేశంలో ఆ కౌన్సిరల్ హాజరైనట్లు సంతకాలు ఉన్నాయి. డిసెంబరు, జనవరిలో జరిగిన సమావేశంలో సంతకం లేదు. ఫిబ్రవరిలో జరిగిన సమావేశానికి హాజరైనట్లు ఒకచోట సంతకం పెట్టి మళ్లీ దానిని కొట్టేశారు. మార్చి, ఏప్రిల్‌లో జరిగిన సమావేశాలలో ఆ కౌన్సిలర్ గైర్హాజరయ్యారు. మే నెలలో (శనివారం జరిగిన) సమావేశంలో హాజరైనట్లు రిజిస్టర్‌లో ఎవరో సంతకం చేశారు. ఇటువంటి పరిస్థితే రాయచోటి మునిసిపాలిటీలోనూ ఉన్నట్లు సమాచారం. కొందరు కౌన్సిలర్లు విదేశాలకు వెళ్లిపోయారు.. అయితే వాళ్ల సభ్యత్వం రద్దు కాకుండా ఉండేందుకు ఎవరో సంతకాలు చేస్తున్నారు. ఇలా దొంగ సంతకాలు చేయడం మునిసిపల్ పాలకవర్గం, అధికారులకు తెలియకుండానే ఉంటుందని మనం అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. నిజమైన కౌన్సిల్ సభ్యులు సభకు హాజరవుతున్నారా.. లేదా వాళ్లకు బదులు ఇతరులు వస్తున్నారా? అనేది నిర్ధారించుకోవాల్సిన బాధ్యత అధికారులు, మునిసిపల్ పాలకవర్గంపైన ఉంటుంది.

ముబీనా ముబషిర్ సమావేశానికి హాజరైంది

శనివారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి 17వ వార్డు కౌన్సిలర్ ముబీనా ముబషిర్ హాజరైంది. వారి సంప్రదాయం ప్రకారం బురఖాలో వచ్చింది. సమావేశం ప్రారంభం అయ్యాక అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోయింది.

- మనూజ, మునిసిపల్ చైర్‌పర్సన్, మదనపల్లె

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరినాథ్ సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ముబీనా ముబషీర్ సభకు హాజరు కాకపోయినా.. ఎవరో గుర్తు తెలియని మహిళ వచ్చి సంతకం చేసిందని, ఆమె ఎవరో నిగ్గు తేల్చాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తెలుగుజాతి యుగ పురుషుడు ఎన్టీఆర్

- సినీ హీరో నారా రోహిత్



ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న సినీ హీరో నారా రోహిత్, టీడీపీ నేతలు

చిట్వేలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఎన్టీఆర్ తెలుగుజాతి యుగపురుషుడు అని తెలుగు వారి కీర్తి ప్రతిష్ఠను నలుదిశలా వ్యాపింపజేసిన మహోన్నత వ్యక్తి అని ప్రముఖ సినీ నటుడు నారా రోహిత్ కొనియాడారు. సోమవారం మండల పరిధిలోని నక్కలపల్లెలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నారా రోహిత్‌కు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం నారా రోహిత్ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు తనను ఆహ్వానించడం సంతోషకరంగా ఉందన్నారు. సినీరంగంలో చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ తెలుగు రాజకీయాలను కొత్త మలుపు తిప్పారని కొనియాడారు. అనంతరం నక్కలపల్లెలోని స్థానిక భవానీ శంకరాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి విశ్వనాథ్‌నాయుడు, రాష్ట్ర ఖాదీ విలేజి ఇండస్ట్రీ చైర్మన్ కేకే చౌదరి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, మాచినేని విశ్వేశ్వర్‌నాయుడు, కట్టా గుండయ్య, సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు, నక్కలపల్లె మాజీ సర్పంచ్ చంద్రమోహన్‌నాయుడు, అడ్వకేట్ బాలాజీ, గుత్తి నరసింహ, రాజా, నక్కలపల్లి యువత, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరించండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంతృప్తి చెందేలా పీజీఆర్ఎస్ అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. తాను కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నానని, తనకు ఇంటి స్థలం, ప్రభుత్వం తరపున ఇంటిని మంజూరు చేయాలని రాయచోటి పట్టణానికి చెంది పల్లా వనజ కలెక్టర్‌కు విన్నవించుకుంది. ఒంటరి మహిళగా జీవనం సాగిస్తున్న తనకు బియ్యం కార్డు, రేషన్ మంజూరు చేయాలని సుండుపల్లె మండలం కొండల తూర్పు గ్రామానికి చెందిన పి.లక్ష్మీదేవి కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. రైల్వేకోడూరు మండలం ఎస్.కొత్తపల్లి గ్రామనికి చెందిన కె.వెంకటనరసమ్మ పక్షవాతంతో బాధపడుతున్న తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించుకుంది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేతల దాడి



దాడి ఘటనపై వివరాలు తీసుకుంటున్న అర్బన్ పోలీసులు

రాయచోటిటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరం సమీపంలో గల కంచాలమ్మ గండి చెరువు నుంచి అక్రమంగా మట్టి, ఇసుకను వైసీపీ నేతలు తరలిస్తుండడంతో అడ్డుకున్న టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేతలు రాడ్లు, కర్రలతో దాడి చేసిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే... రాయచోటి పట్టణ పరిధిలోని ఎగువ అబ్బవరానికి సమీపంలో గల కంచాలమ్మ గండి చెరువు నుంచి కొద్ది రోజులుగా మాజీ కౌన్సిలర్, వైసీపీ నేత ఆనందరెడ్డి అతడి అనుచరులు ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నారని అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆవుల గంగిరెడ్డి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాపైనే అధికారులకు ఫిర్యాదు చేస్తావా అంటూ సోమవారం రాయచోటి నుంచి స్వగ్రామానికి వెళ్తున్న ఆవుల గంగిరెడ్డిపై వైసీపీ మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి తన అనుచరులతో కలిసి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వెంటనే అతడిని భార్య లక్ష్మీదేవితో పాటు స్థానికులు చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాయచోటి అర్బన్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని దాడి సంఘటనపై విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అర్చనా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని గంగిరెడ్డిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

జీవనోపాధి సాధనాలను సద్వినియోగం చేసుకోండి

- విభిన్న ప్రతిభావంతులకు సాధనాల పంపిణీలో కలెక్టర్



విభిన్న ప్రతిభావంతులకు సాధనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న జీవనోపాధి సాధనాలను సద్వినియోగం చేసుకుని తమ జీవితాన్ని మెరుగుపరచుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు రూ.4.29 లక్షల విలువైన జీవనోపాధి సహాయక ఉపకరణాలను లబ్ధిదారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఇందులో ముగ్గురు లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ.90 వేలు విలువ చేసే మూడు ఎలక్ట్రికల్ రెట్రో ఫిట్టెడ్ మూడు చక్రాల స్కూటర్లు, ఇద్దరికి ఒక్కొక్కటి రూ.42 వేల విలువ గల 2 బ్యాటరీ ఆధారిత ట్రై సైకిళ్లు, ఒక్క లబ్ధిదారుడికి రూ.75 వేల విలువ చేసే హైటెక్ హైడ్రాలిక్ కృత్రిమ కాలు తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు దివ్యాంగులను ఆదుకునేలా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ కృష్ణకిశోర్, వారి సిబ్బంది, జిల్లా అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వేదిక ఫిర్యాదులపై దృష్టి పెట్టండి

- పోలీసు అధికారులను ఆదేశించిన ఎస్పీ



జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన దివ్యాంగురాలి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులపై దృష్టి పెట్టి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను విన్నవించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకుని వారి ఫిర్యాదులను పరిశీలించారు. రాయచోటి పట్టణానికి చెందిన దివ్యాంగురాలు కాత్యాయని తన సమస్య చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు నేరుగా దివ్యాంగురాలి వద్దకే వెళ్లి సమస్య విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో ఆమె సమస్యను పరిష్కరించాలని రాయచోటి అర్బన్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి రాలేని, బాధితులు వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆ ఫిర్యాదులను కూడా సకాలంలో విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యేక పూజలు

- కొండాపురంలో స్టాపింగ్‌పై స్థానికుల హర్షం



కొండాపురం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు

కొండాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు కొండాపురం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రైలుకు సోమవారం నుంచి కొండాపురంలో స్టాపింగ్ ఇవ్వడంతో మొదటిరోజు రైలు స్టేషన్‌కు చేరుకోగానే స్థానికులు పూజలు నిర్వహించారు. విశాఖపట్నం-కడప మధ్య నడిచే ఈ రైలు కొండాపురం వరకు వచ్చి స్థానిక రైల్వేస్టేషన్‌లో నీళ్లు నింపుకొని వెళ్లేది. ఖాళీగా వెళుతున్న ఈ రైలుకు కొండాపురంలో స్టాపింగ్ లేకపోవడంతో టికెట్లు ఇచ్చేవారు కాదు. ఇదే విషయమై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో పాటు ప్రజాసంఘాల నాయకులు పలుమార్లు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈ రైలును కడప నుంచి గుంతకల్లు వరకు పొడిగించడంతో పాటు ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ ఇస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (ట్రైన్ నెం. 07521 /07522) గా పరిగణిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7.45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుకుంటుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30 కు బయలుదేరి కొండాపురం, ఎర్రగుంట్ల మీదుగా కడపకు సాయంత్రం 5.15కు చేరుకొని అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది. గుంతకల్లు నుంచి విజయవాడ మీదుగా వైజాగ్ వెళ్లే రాయలసీమ వాసులకు ఈ రైలు ఎంతో సౌకర్యంగా ఉండనుంది.

సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, సోలార్ ప్యానల్స్ ఇన్‌స్టలేషన్ ఖర్చు, సబ్సిడీలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించి రిజిస్ట్రేషన్లు పెంచాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఈఈలు, నెడ్‌క్యాప్ సిబ్బంది, జిల్లాలో సోలార్ ఇన్‌స్టాల్ చేసే వెండర్లు తదితరులతో జిల్లాలో సీఎం సూర్య ఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ రిజిస్ట్రేషన్లు పెరగాలని విద్యుత్‌శాఖ సిబ్బంది, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ ఈఈలు, డీఈలు, ఏడీఏలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సుందర ప్రదేశం.. ఆదమరిస్తే ప్రమాదం...

- పర్యాటకులను ఆకర్షించే గంగోత్రి కొలను..



హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో ఉన్న సుందరప్రదేశం గంగోత్రి కొలను

గంగోత్రి కొలను వద్ద ఫొటోలు తీసుకుంటున్న యువకులు

బి.కొత్తకోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్‌లో పర్యాటకులు సందర్శించే ముఖ్యమైన ప్రదేశాలలో గంగోత్రి కొలను ఒకటి. ఘాట్‌రోడ్డు ప్రయాణంలో మలుపులు దాటుకుంటూ 4 వేల అడుగుల ఎత్తుకు చేరుకున్నాక రహదారి పక్కనే ఆనకట్టతో నీరు నిల్వ ఉండి, చుట్టూ పచ్చదనం, ఏపుగా పెరిగిన హరితవనం మధ్యలో ఉన్న చూడముచ్చటైన ప్రదేశం ఈ గంగోత్రి. పర్యాటకులు కొండమీదకు వెళ్లక మునుపే ఇక్కడ ఆగి సరోవరం చుట్టూ ప్రకృతి అందాలను ఆస్వాదించి ఫొటోలు, వీడియోలు తీసుకుని, చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణంలో కాసేపు సేదతీరుతారు. హిల్స్ పర్యటనకు బృందాలుగా తరలివచ్చే యువకులు ఇక్కడ చేసే అల్లరి, ఎంజాయ్‌మెంట్ ఓ రేంజ్‌లో ఉంటుంది. యువజంటలు, ప్రేమికుల ఫొటో షూట్‌కు గంగోత్రి ప్రధాన వేదికగా నిలుస్తోంది. ఇక్కడి అందమైన ప్రకృతి చూపరులను కట్టి పడేస్తుంది.

ఆదమరిస్తే ప్రమాదం..

పర్యాటకులకు ఇక్కడ ఎంతో ఆనందం, ఆస్వాదన లభిస్తుంది. అయితే మరోవైపు ప్రమాదం కూడా పొంచి ఉంది. వినోదయాత్రకు వచ్చిన యువకులు మద్యం తాగి, సరదాగానో ఈ గంగోత్రిలో ఈతకు ఉపక్రమించి ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గతనెల 30న బి.కొత్తకోటకు చెందిన ఓ యువకుడు ఈ కొలనులో ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయాడు. మరోవైపు ఈ గంగోత్రి వద్ద చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. హిల్స్‌పై వన్య ప్రాణులకు ప్రధాన నీటి వనరుగా ఈ గంగోత్రి ఉన్నందున చిరుతపులి సంచరిస్తోందని పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు.

నిన్న టమోటా మార్కెట్ కూలీ..

- నేడు అదే మార్కెట్ కమిటీలో డైరెక్టరు



ప్రమాణ స్వీకారం చేస్తున్న రాంబాబు, శ్రీనివాస వర్మ

కలికిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అతను గత ఇరవై ఏళ్లుగా స్థానిక టమోట మార్కెట్‌లో కూలీ. అదే అతడి జీవనాధారంగా పెరిగాడు. కలికిరి పంచాయతీ మాదిగపల్లెకు చెందిన దళితుడైన రాంబాబు సోమవారం అదే మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ పాలక వర్గం సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడం విశేషం. రాంబాబు ఇరవై ఏళ్లుగా ఈ మార్కెట్‌లో కూలీగా పనిచేస్తూ ఎదిగాడు. మరోవైపు టీడీపీ అభిమానిగా పార్టీలో కష్టపడి గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడి అంకితభావం గుర్తించిన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి ఏకంగా రాంబాబును మార్కెట్ కమిటీ డైరెక్టరుగా పదవి ఇప్పించడం చర్చనీయాంశంగా మారింది. అతడితోపాటు మార్కెట్ యార్డు ప్రహరీకి ఆనుకునే ఉన్న గిరిజ కాలనీకి చెందిన శ్రీనివాస వర్మకు కూడా టమోటా మార్కెట్‌తో అనుబంధముంది. 2007లో నాలుగు మండలాల ఉమ్మడి మార్కెట్ కమిటీ డైరెక్టరుగా ఒకసారి నియమించబడ్డారు. ప్రస్తుతం టీడీపీ ఎస్టీ విభాగం కన్వీనరుగా ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా గిరిజనుడైన శ్రీనివాస వర్మకు తిరిగి పదవి కట్టబెట్టారు. ప్రమాణ స్వీకార అనంతరం జరిగిన బహిరంగ సభలో ఈ ఇరువురూ కిశోర్‌కుమార్ రెడ్డికి పెద్ద పూల మాల వేసి కృతజ్ఞతలు తెలిపారు.

రాయలసీమ జైళ్ల శాఖ డీఐజీగా రవికిరణ్..?

కడప క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జైళ్లశాఖ డీఐజీగా రవికిరణ్ రానున్నట్లు తెలుస్తోంది. ఈయన గతంలో కడప సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసి డీఐజీగా పదోన్నతి పొందారు. కడప జైళ్లశాఖ డీఐజీగా కూడా పనిచేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ డీఐజీలుగా కడప సూపరింటెండెంట్లు విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం రవికిరణ్ పూర్తిస్థాయిలో డీఐజీగా విధులు నిర్వహించనున్నట్లు సమాచారం.

ఇండోర్ స్టేడియం ఎన్నటికో...

- శిలాఫలకానికే పరిమితం
- క్రీడాకారులకు తప్పని ఇక్కట్లు
- మంజూరైన నిధులు రద్దు

6

రైతులకు అవగాహన సదస్సు

● జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఐ.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సిద్దవటం ఎంపీడీవో సభాభవనంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కోసం ప్రతిరైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వరి, సజ్జ, చిరుధాన్యాలు, సాగు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు విస్తీర్ణం పెంపు ప్రకృతి వ్యవసాయ విధానాలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యత, పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి భరత్‌రెడ్డి, జిల్లా రీసోర్స్ కమిటీ సభ్యులు పద్మజ, శాస్త్రవేత్తలు, మానస, ఖురేషి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

నిత్యపూజస్వామికి హుండీ ద్వారా రూ.1,08,353 ఆదాయం



నిత్యపూజ ఆలయ హుండీ లెక్కింపులో పాల్గొన్న ఎండోమెంట్ సిబ్బంది, స్థానిక పోలీసులు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీలోని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూస్వామి దేవస్థానానికి సంబంధించిన హుండీలను సోమవారం లెక్కించగా రూ.1,08,353 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. స్వామివారి హుండీలో భక్తులు వేసిన కానుకలు ద్వారా మార్చి 28 నుంచి జూన్ 2 వరకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ, ధర్మదాయశాఖ కొండా గంగమ్మ దేవస్థానం, నందిమండలం కార్యనిర్వహణ అదికారి మారుతిప్రసాద్ ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏ.శ్రీధర్ సిద్దవటం పోలీసులు శివప్రసాద్‌రెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు సుబ్రమణ్యంశర్మ, వంతాటిపల్లె గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం షాపులో సీసీ ఫుటేజీ పరిశీలన



వైన్‌షాపులో సీసీఫుటేజిలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట గ్రామ సమీపాన ఉన్న శ్రీకృష్ణ వైన్ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ భాకరాపేట గ్రామ శివారులో ఉన్న శ్రీకృష్ణ వైన్‌షాపును పరిశీలించామన్నారు. అక్కడున్న ప్రొప్రైటర్ రామసుబ్బారెడ్డిని విచారించగా మద్యం షాపులో 30 వేలు విలువ గల మద్యం బాటిళ్లు, క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.5 వేల నగదును దొంగలించారన్నారు. దీంతో బ్రాందీషాపులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించామన్నారు. గుర్తు తెలియని వ్యక్తి షాపు ఉన్న తాళాలను పగులగొట్టి మద్యం బాటిళ్ల అట్ట ముఖానికి అడ్డుపెట్టుకుని లోపలికి ప్రవేశించాడన్నారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదుతో పాటు మద్యం బాటిళ్లు తీసుకెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయిందని రామసుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి

● నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించిందని, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులన్నీ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్‌టీఏ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులన్నీ సెకండరీ ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఆ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కు (డీఎస్సీ)కి కూడా కేటాయిస్తున్నారనే సమాచారం రావడం బాధాకరమన్నారు. అలాగే మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన ప్రధానోపాధ్యాయుల పోస్టులను వందశాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని కోరారు. ఎన్‌టీఏ ముఖ్య నాయకులు రామాంజులు, పక్కీరా, కులశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఆర్‌వీ రమణ, రాజేంద్రనాయుడు, ఆరీఫుల్లా, వెంకట్రామరాజు, శ్రీనివాసులు, నాగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి: డీఈ

నిమ్మనపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆర్ డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప అన్నారు. సోమవారం ఆయన పది రోజుల క్రితం మండలంలో వేసిన తాగునీటి బోర్లను, మురుగునీటి కాలువలను పరిశీలించారు. అనంతరం అగ్రహారం పంచాయతీలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ పనులను పరిశీలించి త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ మిషన్ చక్రవర్తి, ఎంపీవో గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఎన్నటికో...

● శిలాఫలకానికే పరిమితమైన ఇండోర్ స్టేడియం
● క్రీడాకారులకు తప్పని ఇక్కట్లు
● కార్యరూపం దాల్చని నేతల హామీలు
● మంజూరైన నిధులు రద్దు



పీలేరులో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం శిలాఫలకం వేసిన జూనియర్ కళాశాల క్రీడామైదానం

పీలేరురూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ విద్య, వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి సంతరించుకుంటున్న పీలేరు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం ప్రశ్నార్థకంగా మిగిలింది. అదిగో ఇదిగో అంటూనే దశాబ్దాలు గడిచిపోతున్నా స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో క్రీడాకారులు ఉసూరుమంటున్నారు. క్రీడామైదానాల్లో కనీస వసతులు కానరావడం లేదు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా మౌలిక వసతుల కల్పన ఆమడ దూరంలో ఉండడంతో సర్వత్రా నిరుత్సాహం నెలకొంది. కనీసం క్రీడల నిర్వహణకు అవసరమైన సామగ్రి సైతం అందుబాటులో ఉండడం లేదు. మరోవైపు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సహకారం అంతంత మాత్రంగానే ఉండడం శోచనీయం.

శిలాఫలకానికే పరిమితం...

పీలేరు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం 14 సంవత్సరాలుగా శిలాఫలకానికే పరిమితమైంది. 2011 జూలై 22న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శిలాఫలకం వేశారు. స్టేడియం నిర్మాణానికి రూ.2.10 కోట్లు నిధులు మంజూరు చేశారు. పీలేరుతో పాటు కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురంలో ఇండోర్ స్టేడియాల నిర్మాణం కోసం శిలాపలకం వేయడంతో పాటు రూ.8.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత క్రీడాకారులు, విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. స్టేడియం నిర్మాణం అదిగో ఇదిగో అంటూనే ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటి వరకూ ఎటువంటి నిర్మాణ పనులు కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. పలుమార్లు స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ అథ్లటిక్ అసోసియేషన్ (శాప్) అధికారులు పీలేరుతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలలోని క్రీడా మైదానాలను పరిశీలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది.

నిర్మాణం పూర్తై ఉంటే...

ఇండోర్ స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చి ఉంటే షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, రన్నింగ్ ట్రాక్, బాల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడల నిర్వహణకు ఎంతో సౌకర్యంగా ఉండేదని క్రీడాకారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఇండోర్ స్టేడియం నిర్మాణంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనవచ్చని సంబరపడ్డారు. అలాగే వీరితో పాటు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు అనేక మంది ఉన్నారు. రన్నింగ్ ట్రాక్ నిర్మాణంతో అథ్లెటిక్స్‌కు ఎంతో దోహదపడేది.

పట్టించుకోని ప్రభుత్వాలు...

అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఇండోర్ స్టేడియం నిర్మాణం గూర్చి పట్టించుకోకపోవడంతో పనులు అటకెక్కాయి. మంజూరైన నిధులు సైతం రద్దు కావడంతో క్రీడాకారులకు కనీస వసతులకు నోచుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా అధికారంలోకి వచ్చిన పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి.

విద్యార్థులకు తప్పని ఇక్కట్లు...

శిలాపలకాలకే ఇండోర్ స్టేడియాల నిర్మాణం పరిమితం కావడంతో విద్యార్థులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదు. పీలేరు మండలంలో సుమారు 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఐదు గురుకుల పాఠశాలలు, బాలురు, బాలిక జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అయితే పీలేరు మినహా ఎక్కడా ఆశించిన మేరకు క్రీడా మైదానాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు క్రీడాకారులు, విద్యార్థుల ఇక్కట్లు గుర్తించి ఇండోర్ స్టేయాల నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

క్రీడల ప్రాముఖ్యతను గుర్తించాలి



క్రీడల ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మించాలి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మెరుగైన వసతులు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలి. మెరుగైన వసతులు లేనందున ప్రతిభ కలిగిన క్రీడాకారులు నష్టపోయే ప్రమాదం ఉంది.

- చంద్రమౌళి, ఫిజికల్ డైరెక్టర్, పీలేరు

మెరుగైన వసతులు కల్పించాలి



ప్రభుత్వాలు ఏవైనా పేద క్రీడాకారుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని మెరుగైన వసతులు కల్పించాలి. క్రీడల పట్ల ఆశక్తి ఉన్నా వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులతో పాటు క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇండోర్ స్టేడియం నిర్మాణంతో క్రీడాకారులకు ఎంతో ఉపయోగం.

-మస్తాన్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పీలేరు

క్షయవ్యాధి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను క్షయ వ్యాధి రహితంగా రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. టీబీ రహిత భారత్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్‌ను మన జిల్లాలో నేటి నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక దశలోనే టీబీ వ్యాధిని నిరోధించడం, క్షయ వ్యాధి వలన కలిగే మరణాలను తగ్గించడం, 2027 సంవత్సరం నాటికి భారతదేశంలో క్షయవ్యాధిని నిర్మూలించడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

నిక్షయ మిత్ర పథకానికి విరాళాలివ్వండి

టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నుంచి 8 నెలల పాటు పోషకాహారం అందించడానికి నిక్షయ మిత్ర పథకానికి విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. నెలకు రూ.500 నుంచి రూ.700 వరకు, అలా ఆరు నెలలకు రూ.3 వేల నుంచి రూ.4200 వరకు ఒక్కొక్క టీబీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం అందించేందుకు రావాలన్నారు.

ఉదారత చాటుకున్న కలెక్టర్, జేసీ

జిల్లాలో నేటి నుంచి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక్కొక్కరు ముగ్గురు క్షయ వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకొని వారి పోషకాహారం కోసం తమ సొంత నిధుల నుంచి రూ.10 వేలు అందించారు. అలాగే డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు ఒక్కొ క్కరు ఇద్దరు చొప్పున దత్తత తీసుకుని రూ.5 వేలు అందించారు. జిల్లా అధికారులు కూడా స్వచ్ఛంగా ముందుకు వచ్చి తమవంతుగా తోచిన మేరకు ఆర్థిక సహాయం అందించి క్షయ రహిత జిల్లా కోసం కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు డిప్యూటీ తహసీల్దార్‌పై జేసీకి ఫిర్యాదు

● రాయచోటి ఆర్డీవోను విచారణకు ఆదేశించిన జేసీ



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న సుధీర్‌కుమార్

గాలివీడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బోరు బావి తవ్విన పుల్లారెడ్డిగారిసుబ్బారెడ్డి దళిత కుటుంబానికి వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తు బంధు ప్రీతితో వ్యవహరించిన గాలివీడు మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డిపై విచారణ జరిపించి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ ఫిర్యాదు చేశారు. జేసీ స్పందిస్తూ రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులును విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గాలివీడు మండలం చీమలచెరువుపల్లె పంచాయతీ కడపవాండ్లపల్లె దళిత కులానికి చెందిన ధారా వెంకట్రమణకు సర్వే నెంబర్ 973/3లో మూడు ఎకరాలు, సర్వే నెంబర్ 2985/1లో ఒక ఎకరా 14 సెంట్లు వ్యవసాయ సాగు భూమి ఉందని తెలిపారు. వరి భూమి పక్కనే చీమలచెరువుపల్లె పంచాయతీ ఎర్రదొడ్డిపల్లెకు చెందిన పుల్లారెడ్డిగారి సుబ్బారెడ్డికి, వారి బంధువులకు భూమి ఉందని తెలిపారు. అయితే సర్వే నెంబర్ 973/3ను ఆనుకుని 50 సెంట్లు విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి ఉండగా గత 30 సంవత్సరాల క్రితం నుండి ధారా వెంకట్రమణ తయారు చేసుకుని తన అనుభవంలోనికి తెచ్చుకుని చెరువులు నిండిన సందర్భంలో వరి పంటను పెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గత ఆరు నెలల క్రితం వెం కట్రమణ కుమారుడు మానసిక వ్యాధికి గురికావడంతో బెంగళూరులో చికిత్స తీసుకోవడాన్ని ఆసరా చేసుకున్న సుబ్బారెడ్డి ఎటువంటి అనుమతులు లేకుండా దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిలో దౌర్జన్యంగా బోరుబావిని తవ్వాడన్నారు. అంతేగాక వెంకట్రమణ ఏర్పరుచుకున్న హద్దులను సైతం చెరిపేసి అందులోకి వెళ్లనివ్వకుండా బెదిరించాడన్నారు. ఈ విషయమై వెంకట్రమణ గాలివీడు మండల తహసీల్దార్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్లకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గాలివీడు మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డికి, ఆక్రమణదారుడు సుబ్బారెడ్డికి బంధుత్వం ఉన్న నేపథ్యంలో విచారణ పేరుతో ఫీల్డ్‌కు వెళ్లి వెంకట్రమణ ఫిర్యాదును ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వెంకట్రమణ అమ్మ పేరున సర్వే నెంబర్ 2985లో ఉన్న భూమిని సర్వే చేయించి 8 మామిడి చెట్లు సుబ్బారెడ్డికి చెందేవిధంగా నిర్ణయించి దళితులకు అన్యాయం చేశారన్నారు. కావున దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాజేయడానికి కుట్ర పన్నిన సుబ్బారెడ్డి మీద, బంధు ప్రీతితో సుబ్బారెడ్డికి అనుకూలంగా దళితులకు వ్యతిరేకంగా వ్యవహరించి ప్రభుత్వ విధులను దుర్వినియోగ పరిచిన గాలివీడు మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితుడు వెంకట్రమణ, అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ రాబోయేది టీడీపీ ప్రభుత్వమే: ఎమ్మెల్యే నల్లారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగించడంలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ విజయవంతంగా ముందుకెళుతున్నారని ఆయన చెప్పారు. పార్టీకి, ప్రజలకు అంకితభావంతో సేవలు చేసిన వారికి పదవులు వరిస్తాయన్నారు. కలికిరి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా మాలతి, వైస్ ఛైర్మన్‌గా సనావుల్లాతో పాటు మొత్తం పాలకవర్గం సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో జరిగిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా ప్రజల అభిమానాన్ని సంపాదిస్తేనే పదవుల్లోకి వస్తారని, అధికారముండేది పెత్తనం చేయడం కోసం కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ముందుగా ఛైర్ పర్సన్‌గా మాలతి, వైస్ ఛైర్మన్‌గా సనావుల్లా, డైరెక్టర్లుగా కలికిరి, కలకడ మండలానికి చెందిన పి.తేజకుమార్, సి.అస్లామ్, బి.వసంత, వీఎస్ మెహర్ బాను, పి.రెడ్డెమ్మ, ఎం.శ్యామల, ఇ.శ్రీనివాస వర్మ, కె.రెడ్డెమ్మ, టి.నరసమ్మ, ఎం.రాజగోపాల్ రెడ్డి, ఎస్.ముబారక్ ఆలీ, ఎస్.విశ్వనాథం శెట్టి, సి.రాంబాబు, సర్పంచు విశ్వనాథ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. పలువురు నాయకులు పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్కీకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, యోగేష్ రెడ్డి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండల టీడీపీ నాయకులు నౌషద్, జయసూరి, చిట్టి, రవిప్రకాష్ పాల్గొన్నారు.

కలికిరి సంతలో దొంగ నోటు



బయటపడ్డ ఐదు వందల నకిలీ నోటు

కలికిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలికిరి సంతలో ఒక ఐదు వందల రూపాయల నకిలీ నోటు చలామణి జరిగింది. అయితే అది పూర్తిగా దొంగనోటు కాదు.. కానీ ఎవరో ఒక మహిళా వ్యాపారికి ఇవ్వడంతో ఆమె మోసపోయింది. అచ్చు ఒరిజినల్ నోటు మాదిరిగానే వుండటంతో చదువురాని ఆ మహిళ సులభంగా మోసానికి గురైంది. సంతలో నన్నారి సోడా బండి పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్న ఒక మహిళ దగ్గర సోడా తాగి రూ.ఐదు వందల నోటు ఇచ్చాడు. దీన్ని మడత పెట్టి ఇవ్వడంతో ఆమె గమనించకోకుండా చిల్లర ఇచ్చేసింది. ఆ తరువాత చూసుకుంటే అది చిన్న పిల్లలు ఆడుకునే నోటుగా తేలింది. దాని మీద చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని స్పష్టంగా వున్నా ఆమె గమనించకుండా మోసపోయింది. విషయం తెలియడంతో అక్కడ జనం పోగయి, మోసగాడి కోసం గాలించారు. అప్పటికే అతడు ఉడాయించడంతో ప్రజలు, వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

'పెన్షనర్లు పే స్లిప్‌లు పరిశీలించుకోవాలి'

కలికిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అయిన ఉద్యోగులు తమ పెన్షన్లకు సంబంధించిన పే స్లిప్పులను పరిశీలించుకోవాలని రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యదర్శి సురేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మే నెలకు సంబంధించిన పేమెంట్ స్లిప్పులు కొత్త విధానంలో జనరేట్ అయ్యాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పలు రకాల వివరాలను పరిశీలించుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన పెన్షన్ స్లిప్పులో పెన్షనరు పేరు, పుట్టిన తేదీ తదితర పలురకాల వివరాలు సక్రమంగా వున్నాయో లేదో బేరీజు వేసుకోవాలని చెప్పారు. వయసు 70 ఏళ్లు దాటిన పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అదనపు క్వాంటమ్ మొత్తం కలిసిందా లేదా అని పరిశీలించాలన్నారు. కమ్యుటేషన్ ఎప్పుడు చెల్లించారు? రికవరీ ప్రారంభ తేదీ వివరాలు కూడా ఈ కొత్త రకం పే స్లిప్పులో పొందుపరిచారని చెప్పారు. గతంలో 2024 నవంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు కమ్యూటేషన్ రికవరీ ఆరు నెలల పాటు నిలుపుదల చేసిన వారందరి నుంచి హైకోర్టు తీర్పు మేరకు 12 వాయిదాలలో తిరిగి రాబట్టుకోవడం ఈ నెల నుంచి ప్రారంభించినట్లు గమనించాలని కోరారు. వారి నుంచి ఈ నెల నుంచి రెగ్యులర్ కమ్యుటేషన్‌తో పాటు రికవరీ వాయిదాలను కలిపి ఈ నెల నుంచి మినహాయిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. భార్యా భర్తలు ఇరువురూ సర్వీసు పెన్షన్ పొందుతున్నట్లయితే ఈహెచ్ఎస్ నెలవారీ చందాను ఒకరికి మాత్రమే మినహాయిస్తే సరిపోతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ స్కేల్ పొందేవారికి డీఆర్ 33.67 శాతం, యూజీసీ స్కేల్ పొందే వారికి 46 శాతం డీఆర్‌లు పేమెంట్ స్లిప్పులో గమినించాలని కోరారు. పెన్షనర్లు ఏ ట్రెజరీ ద్వారా పెన్షన్ పొందుతున్నారో దాని ఎస్‌టీవో యొక్క డీడీవో కోడ్ కూడా నమోదయి వుంటుందని గమనించాలని సురేంద్రరెడ్డి వివరించారు.

'అవినీతి ఆర్ఐపై చర్యలు తీసుకోవాలి'

తంబళ్లపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, లంచం లేనిదే పనులు చేయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు గంగరాజు సుధాకర్, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పలు గ్రామాల బాధిత రైతులు ప్లకార్డులతో తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే తప్పుల తడకగా ఉందని, వెంటనే రీ సర్వేను రద్దు చేసి కొత్తగా చేపట్టాలన్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రైతులు చలపతినాయుడు, వెంకట మల్లప్ప, వాసు, నిరంజన్‌రెడ్డి, రమేష్, శ్రీధర్, పక్రుల్లా, రమణయ్య, వెంకట్రమణ తదితర రైతులు పాల్గొన్నారు.

బయోత్పాతం

- గాడితప్పిన జీవవ్యర్థాల నిర్వహణ
- చెత్తలో కలిపేస్తున్న బయో వేస్టేజీ
- పారిశుధ్య కార్మికుల ప్రాణాలతో చెలగాటం

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాసుల కక్కుర్తితో కొన్ని ఆస్పత్రులు పట్టణవాసుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నాయి. పర్యావరణం ప్రజా ఆరోగ్యం పాలిట ముప్పుగా మారిన జీవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్టేజీ) నిర్వహణ ప్రొద్దుటూరులో దారుణంగా తయారైంది. చెత్తతోపాటు బయో వేస్టేజీని కలిపి మున్సిపల్ కార్మికుల చేతికి అందిస్తున్నారు. బయో వ్యర్థాలపై అవగాహన, దాని ప్రమాదస్థాయి తెలియని అభం, శుభం ఎరుగని పారిశుధ్య కార్మికులు వీటిని సాధారణ చెత్తలో కలిపి తీసుకెళుతున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాలకు చెందిన ప్రైవేటు ఆస్పత్రులలో నెలకొన్న ఈ జాడ్యంపై అధికారుల క్షేత్ర పరిశీలన లోపించింది.

ప్రొద్దుటూరు పట్టణంలో దాదాపు 130 వరకు చిన్న, పెద్ద క్లీనిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులతోపాటు మెడికల్ బ్లడ్‌ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల నుంచి వెలువడే వేస్టేజీలను తీసుకెళ్లేందుకు ఒక్కో ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్డుకు కొంత డబ్బును బయోవేస్టేజీ సంస్థ వసూలు చేస్తుంది. అయితే బయో వేస్టేజీ తరలించే వాహనాన్ని పరిశీలిస్తే.. సేకరణ అయ్యే వేస్టేజీకి, ఆస్పత్రుల సంఖ్య వాటి నుంచి వెలువడే వ్యర్థాలకు పొంతన లేకుండాపోతోంది. బయో వేస్టేజీ నిర్వహణ సంస్థకు చెల్లించే డబ్బులకు కక్కుర్తిపడో లేక బయోవ్యర్థాలపై నిర్లక్ష్యమో కొంతమంది ఆస్పత్రి నిర్వాహకులు వేస్టేజీలను ఇవ్వకుండా మున్సిపల్ చెత్త తీసుకెళ్లే పారిశుధ్య కార్మికుల చేతికి అందిస్తున్నారు. మున్సిపల్ చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్లలో చెత్తతోపాటు బయో వేస్టేజీలను వాహనంలో పడవేయడంతో డంపింగ్‌యార్డులకు తరలివెళుతోంది. బయో

అవగాహన కల్పిస్తాం...

బయోవ్యర్థాలు మునిసిపల్ చెత్తలో కలిసేందుకు వీల్లేదు. అలాంటి వాటిపై దృష్టి సారిస్తాం. బయోవేస్టేజీపై మునిసిపల్ కార్మికులలో అవగాహన కల్పిస్తాం. సాధారణ చెత్తలో ఈవేస్టేజీ చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

వి. మల్లికార్జున,
మునిసిపల్ కమిషనర్,ప్రొద్దుటూరు.

తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రుల నుంచి వెలువడే బయోవ్యర్థాలను శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్‌కు అందించాలి. బయోవ్యర్థాల నిర్వహణ కచ్చితంగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారి సమాచారం అందిస్తే.. అలాంటి ఆసు పత్రులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

-అనిల్, ఏఈ, ఏపీ పొల్యూషన్
కంట్రోల్ బోర్డు, కడప



వేస్టేజీలలో సుమారు 30 నుంచి 40 శాతం మునిసిపల్ చెత్తలో కలుస్తోందని స్వయంగా కొంత మంది వైద్య రంగానికి చెందిన నిపుణులు చెప్పండం గమనార్హం.

ఆరోగ్యంతో చెలగాటం

జీవ వ్యర్థాలకు సంబంధించిన బట్టలు, మానవ అవయవాలు, సూదులు, ఇతర రకాల బయో వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు పట్టుకోవడం వలన వారికి తెలియకుండానే వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎంత ప్రమాదమో పారిశుధ్య కార్మికులకు అవగాహన లేకపోవడం వలన ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మున్సిపల్ కార్మికులు తెలియకుండానే ప్రాణాలమీదకు తెచ్చుకునే పరిస్థితి కనిపిస్తోంది. మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్మికులకు అసలు బయో వేస్టేజీల వలన ఎదురయ్యే అనేక ప్రమాదాలపై, వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. బయో వేస్టేజీ మున్సిపల్ సాధారణ చెత్తలో కలిపి డంపింగ్‌యార్డుకు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. కాసులకు కక్కుర్తిపడే కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు చూపిస్తున్న అశ్రద్ధ వ్యవహారంపై కాలుష్య నియంత్రణ మండలి నిఘా పెంచి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నిబంధనల ప్రకారం

బయో మెడికల్ వేస్టేజీల నుంచి ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్ వెలువడుతుంది. వీటిని నిర్దేశిత కవర్లలో భద్రపరచి 48 గంటల లోపు కామన్ బయోమెడికల్ వేస్టేజీ ట్రీట్‌మెంట్ ఫెసిలిటి (విచ్చిన్న) కేంద్రాలకు తరలించాలి. ఆంధ్రప్ర దేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందిన అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం దంపెట్ల గ్రామ సమీపంలో శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్ వీటి నిర్వహణ చేపడుతోంది. అక్కడి నుంచి ప్రతిరోజు నాలుగు ప్రత్యేక వాహనాలు ఉమ్మడి కడప జిల్లాలోని కడప, పులివెందుల, రాయ చోటి, రాజంపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు తదితర ప్రాంతాలు తిరుగుతూ ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు, నర్సింగ్‌హోం, డయగ్నోస్టిక్ సెంటర్ల నుంచి బయో వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఈ వేస్టేజీని తీసుకెళ్లేందుకు ఆస్పత్రిలో ఉన్న ఒక్కో బెడ్డుకు కొంత డబ్బులను (పడకల స్థాయిని బట్టి) నెలకు రూ. 2వేలు చొప్పున బయో వేస్టేజీ కోసం ఆయా సంస్థలు వసూలు చేస్తుంటాయి. శ్రీవెన్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్ సంస్థ బయోవేస్టేజీలను తీసుకెళ్లి అక్కడ ప్రభుత్వం నిర్దేశించిన పద్ధతులతో వాటిని నిర్వీర్యం చేస్తారు. తర్వాత బయో వేస్టేజీల వలన ఉత్పన్నం అయ్యే ఎటు వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపించకుండా కట్టడి చర్యలు చేపడుతారు. వ్యర్థాలను వేసి ఉంచేందుకు కావలసిన కవర్లను కూడా ఈ సంస్థే అందిస్తుంది. పసుపు రంగు కవరులో మానవ శరీర అవయవాలు, రక్తంతో కూడిన భాగాలు, ప్రయోగ శాల వ్యర్థాలు... ఎరుపు రంగు కవరులో రక్తంతో ఉన్న సామగ్రి, కాటన్ డ్రెస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, సిరంజీలు, ప్లాస్టిక్ వ్యర్థాలు.. నలుపు రంగు కవరులో కాలం చెల్లిన ఔషధాలు, సూదులు, బ్లేడ్లు, ఇతర పదునైన వస్తువులు.. నేరేడు రంగు కవరులో క్యాన్సర్ కారక మందులు, వీటి వ్యర్థాలు ఉంచి భద్రపరచాలి.



బయో వేస్టేజీ అంటే.....

సాధారణంగా ఆస్పత్రుల నుంచి వచ్చే మాంసపు, శరీర అవయవాలు, రక్తంతో కూడుకున్న భాగాలు, కాటన్, డ్రస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, పనికిరాని, కాలం చెల్లిన ఔషధాలు, వాడి పడేసిన సూదులు, బ్లేడ్లు, తదితరాలను జీవవ్యర్థాలుగా వ్యవహరిస్తుంటారు. వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడవేయకూడదు. వీటి నుంచి ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్, గాలిలోకి చేరుతుంది. 48 గంటల లోపు విచ్చిన్న కేంద్రాలకు ఈ వేస్టేజీలను తరలించాలి. వీటిని తాకినా, నేరుగా ముట్టుకున్నా తద్వారా పలు ప్రాణాంతక వ్యాధులకు గురికాకతప్పదు.

ఆసుపత్రిలలో వెలువడే బయోవ్యర్ధాలు (నమూనా చిత్రం)

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయభేరి



నిఖిలేశ్వర్‌రెడ్డి, నెల్లూరు
83 పరుగులు



లోహిత్, చిత్తూరు
84 పరుగులు

కడప స్పోర్ట్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 పురుషుల అంతర్‌జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం నెల్లూరు జట్టు కర్నూలు జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో చిత్తూరు జట్టు కడప జట్టుపై విజయం సాధిం చింది. వివరాలిలా.. వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 49.4 ఓవర్లలో 387 పరుగుల భారీస్కోర్ సాధించి ఆలౌట్ అయింది. ఇందులో నిఖిలేశ్వర్‌రెడ్డి 83 పరుగులు, మన్విత్‌రెడ్డి 67, సోహన్‌వర్మ 62 పరుగులు చేసి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. కాగా బౌలింగ్ విభాగంలో కర్నూలు బౌలర్ ఖానిష్ 5 వికెట్లు పడగొట్టాడు. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు కేవలం 26.3 ఓవర్లలో 162 పరుగుల స్వల్ప స్కోర్‌కే అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. ఇందులో ఖానిష్ 60 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో నెల్లూరు బౌలర్ భార్గవ్ 5 వికెట్లు సాధించి నెల్లూరు జట్టుకు భారీ విజయాన్ని అందించారు. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసింది. ఇందులో శివకేశవ 63 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 49.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసి విజయభేరి మోగించింది. ఇందులో లోహిత్ 84 పరుగులు చేయగా నిఖిత్‌గౌడ్ 54 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు సత్వర చర్యలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

కడప కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. టీబీ యాక్ట్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపస్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఉన్న షుగర్ వ్యాధిగ్రస్థులు, ఆల్కహాల్, పొగ తాగువారు, పొగాకు ఉత్పత్తులు వాడే వారితోపాటు 60 సంవత్సరాలు పైబడిన వారికి నిర్ధారణ పరీక్షలు తప్పక చేయాలన్నారు. క్షయ అంటు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తగిన జాగ్రత్తలు సూచించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రవి బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎన్‌ఐఈపీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవదాయ కమిషనరుపై ఎమ్మెల్సీ ఆగ్రహం



దేవదాయ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి

కడప, కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దూప, దీప నైవేద్యాలకు సంబంధించిన ఫైళ్ల ప్రభుత్వానికి పంపే విషయంలో దేవదాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యంపై ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌కు వచ్చిన ఆయన దేవదాయశాఖ కమిషనరు మురళీతో మాట్లాడుతూ జిల్లాలో గత జనవరి నెలలో పెట్టిన ఫైళ్లను ఇంత వరకు ఉన్న తాధికారులకు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తే ఇంటికి సాగనంపుతానంటూ హెచ్చరించారు. ఏదైనా అర్జీ పెడితే సమాధానం లేదని మండిపడ్డారు. మాలాంటోళ్లకే సక్ర మంగా పలకడం లేదు. సామాన్యులకు ఏం పలుకుతావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఫైళ్లకు వెంటనే సమాధానం లేక పోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇంటి పంపడం ఖాయమని హెచ్చరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ హవా



విద్యార్థులతో నారాయణ కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025 ఫలితాలలో కడప నారాయణ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలిండియా స్థాయిలో డి.సాత్విక 892వ ర్యాంకు, జె.ఐశ్వర్యారాజ్ 1133, బి.వెంకట రామ్‌చరణ్ 1449, టి.రోహిత్‌రెడ్డి 1646, ఎన్.ధనుష్ 1733, సి.ధీరజ్‌కుమార్ 1962, సి.నితిన్‌రెడ్డి 2627, ఎస్.అబ్దుల్ హసీమ్ 3199, పి.ప్రణతిరెడ్డి 4323, బి.జగత్‌స్మరన్ 5704, శ్రావణ్‌కృష్ణ 14701, ఎస్.ఉమర్ ఖైయుమ్ 17356, ఇ.మహమ్మద్ హసన్ 19400 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థుల పట్టుదల తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘన విజయం సాధించామని తెలిపారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, డీన్స్ సుబ్బారావు, బాల వెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్స్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్ విద్యార్థులను అభినందించారు.

పోరుమామిళ్ల విద్యార్థికి 112వ ర్యాంక్



పోరుమామిళ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో పోరుమామి ళ్లలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థి సుమన్ సుకుమార్‌రెడ్డి ఆలిండియా ఇంజనీరింగ్ విభాగంలో 112వ ర్యాంక్ సాధించాడని కరస్పాండెంట్ పాండురంగారెడ్డి తెలిపారు. అలాగే శశికుమార్ 1122 ర్యాంక్ సాధించాడని ఆయన తెలిపారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా నూతన అధ్యక్షుడిగా హరికిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న
మునగా సతీష్‌కుమార్

కడప మారుతీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగర కో-ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా అనాధ శరణాలయ ప్రాంగణం సాయిసదన్ ఫంక్షన్ హాలులో సోమవారం ఛాంబర్‌ఆఫ్ కామర్స్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా హరికిశోర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్‌గా మేడా జనార్ధన్ రావు, కె.రామమూర్తి (కడప రీజియన్), ఎస్. గోపాలకృష్ణ, శివకుమార్‌రెడ్డి (ప్రొద్దుటూరు రీజియన్), కార్యదర్శిగా మునగా సతీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా పి.వెంకట వంశీకృష్ణనాయుడు (కడప రీజియన్), జాకీర్ అహ్మద్ (ప్రొద్దుటూరు రీజియన్), ట్రెజరర్‌గా కోటా జనార్థన్‌రావుతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మరో 11 మంది ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ మూడు సంవత్సరాలు కొనసాగుతుంది. నూతన కమిటీకి జిల్లా వ్యాపారులు అభినందనలు తెలిపారు.

గొలుసు దొంగలు అరెస్టు

ప్రొద్దుటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక త్రీటౌన్‌పోలీసు స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడుతూ ప్రొద్దుటూరు టౌన్ బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర రాయల్ కౌంటి వద్ద ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో మే 26 తేదీ గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటనలో మైదుకూరు పట్టణం సరాయిపల్లె రోడ్డుకు చెందిన మర్రిజాషువా, మైదుకూరు టౌన్ సాయినాథపురానికి చెందిన మర్రి జయప్రకాష్‌లను సోమవారం స్థానిక సుందరాచార్యుల వీధిలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి సూమారు 45 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈచోరీ కేసులో దొంగలను పట్టుకున్నందుకు త్రీటౌన్ ఎస్ఐలు హనుమంతు, వెంకటరెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న, కానిస్టేబుళ్లు, హోంగార్డులను సీఐ అభినందించారు.

మహిళ నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లిన దొంగ

లింగాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన నారే సునీత అనే మహిళకు చెందిన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అపహరించారు. వివరాల్లోకెళితే.... సునీత తన కుమార్తెతో కలిసి గ్రామంలో ఉన్న పోస్టాఫీస్‌కు వెళ్లి డబ్బులు కట్టి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని పరుగెత్తుకెళ్లాడు. అతన్ని పట్టుకునేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా సమీపంలోని కొండలోకి వెళ్లి తప్పించుకున్నాడు. ఆ మేరకు సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలుశిక్ష

బద్వేలు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో పట్టు బడిన ముగ్గురు నిందితులకు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్‌కుమార్ నాలుగురోజుల జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ సత్యనారాయణలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పోట్లదుర్తి పెద్దమ్మ గుడి వద్ద ఉద్రిక్తత



అధికారులతో మాట్లాడుతున్న సీఎం సురేష్‌నాయుడు



ధర్నాకు కూర్చున్న వైసీపీ నాయకులు, తదితరులు

ఎర్రగుంట్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తి పెద్దమ్మ గుడివద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న ప్రహరీ నిర్మాణాన్ని వైసీపీ నాయకులు మరికొందరితో కలసి అడ్డుకున్నారు. ఈ ఆలయాన్ని అభి వృద్ధి చేసేందుకు ఎంపీ సీఎం రమేష్ సుమారు రూ.90లక్షలు మంజూరు చేయించి కలెక్టర్‌తో అనుమతులు ఇప్పించారు. అయితే ఇక్కడి ఆలయానికి సంబంధించి మొత్తం 3.09 ఎకరాల భూమి ఉండగా ఆక్రమణకు గురైందని.. ఆక్రమణలను తొలగించి ప్రహరీ నిర్మించాలని వైసీపీకి చెందిన సుధాకర్‌రెడ్డి, మరికొందరు సోమవారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా అడ్డుకున్నారు. సీఎం సురేష్‌నాయుడు పెద్దమ్మ ఆలయంలో తన వర్గీయులతో కలిసి కూర్చున్నారు. అదే సమయంలో వైసీపీకి చెందిన సుధాకర్‌రెడ్డి ఆలయంలోకి వెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. అరుపులు, కేకలతో ఘర్షణ వాతా వరణం నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వరప్రసాద్‌రెడ్డి ఆలయంలో ఉన్న సురేష్ నాయుడు వర్గీయులపై ఇటుకతో విసిరినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సురేష్ నాయుడు వర్గీయులు ఆగ్రహించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని పంపి వేశారు. కాగా, ఆలయం వద్ద పనులు మాత్రం జరుగుతూనే ఉన్నాయి. అయితే సాయంత్రం 3.50 గంటలకు ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయని, పనులు నిలిపివేయాలని అధికారులు పేర్కొనడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. కాగా, గ్రామంలో రాత్రి వరకు ఉద్రిక్తంగానే ఉంది. సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవిషయంపై జిల్లా ఎస్పీకి సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీటీ యామిని ఆలయం వద్దకు వెళ్లి ఇరువర్గాల వారితో మాట్లాడినా ఎలాంటి ప్రయోజనం లేదు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు

- జగన్ దేవాదాయశాఖ, ఈవో

పోట్లదుర్తి హనుమనగుత్తి రోడ్డులోని పెద్దమ్మ గుడికి సర్వే నెంబరు 657లో 3.09ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 50 ఏళ్ల క్రితమే కొంత ఆక్రమణకు గురైంది. వారందరికి నోటీసులు ఇచ్చాము. వారు కూడా కోర్టుకెళ్లి లాయర్ నోటీసులు ఇప్పించారు. ప్రస్తుతం ఉన్న భూమిలో అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపీ సీఎం రమేష్ రూ.90లక్షలు నిధులు కలెక్టర్ ద్వారా కేటాయించారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ఆగిపోయాయి. అనంతరం కోర్టు ఉత్తర్వులు మేరకు విజయవాడ దేవదాయ కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో ఇక్కడ పనులు మళ్లీ మొదలు పెట్టాము. అయితే ఆక్రమణలు తొలగించిన తర్వాతనే పనులు మొదలు పెట్టాలని కొందరు ధర్నా చేస్తున్నారు.

శ్మశాన స్థల ఆక్రమణపై నిరసన

రైల్వేకోడూరు,జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్మశాన్ని ఆక్రమించారని, హద్దులు చూపించాలని సోమవారం ఓ.కొత్తపల్లె గ్రామస్థులు రైల్వేకోడూరు రెవెన్యూశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు చాపల చిన్నయ్య, సీ.నరసింహులు మాట్లాడుతూ చాలా కాలంగా శ్మశానికి దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సర్వే నెంబర్ 1504లో 1.75 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిని కొందరు భూస్వాములు ఆక్రమించుకున్నారన్నారు. గ్రామస్థులు జయమ్మ, లక్షుమ్మ, సుబ్బరాయుడు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్సలు అందిద్దాం

లక్కిరెడ్డిపల్లె, జూన్2(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్సలు అందిద్దాం అని లక్కిరెడ్డిపల్లె కమ్యూనిటీ ఆసుపత్రి సూపరిండెంట్ నీలోఫర్‌బేగం పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ అబియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆసుపత్రిలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలన్నారు. దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, తలనొప్పి, శ్వాస పీల్చుకోలేకపోవడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి వారికి చికిత్స చేయించాలన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో 372 ర్యాంక్



రెడ్డిగణేశ్ రాయల్‌ను అభినందిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, జూన్2(ఆంధ్రజ్యోతి): సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం బలిజపల్లెకు చెందిన మంత్రి రెడ్డెయ్య కుమారుడు రెడ్డివెంకటగణేశ్‌రాయల్ ఆల్ ఇండియా స్థాయిలో 372 ర్యాంక్ సాధించిన సందర్భంగా రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీడీపీ పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్డిభాస్కర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం విద్యార్థికి ఉత్తమ ర్యాంకు



మంచాల కృష్ణహర్షిత్

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సోమవారం విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సిద్దవటంకు చెందిన మంచాల కృష్ణ హర్షిత్ జనరల్ కేటగిరిలో ఆలిండియాలో 139వ ర్యాంకు సాధించారు. విద్యార్థి తండ్రి మంచాల ఈశ్వరయ్య కడప లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. తన కుమారుడు పట్టుదల, కృషిలో జేఈఈలో మంచి ర్యాంకు సాధించినందుకు తల్లిదండ్రులు కృష్ణహర్షిత్‌ను అభినందించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యున్నత నైపుణ్యం పొంది ఏ1లో ఉన్నతంగా రాణించాలనే తన లక్ష్యమని ర్యాంకర్ మంచాల కృష్ణహర్షిత్ అన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

గాలివీడు, జూన్2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4వ తేదీన బుధవారం నూలివీడులో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు అన్నికుంట రెడ్డెప్పరెడ్డి, దివాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నూలివీడులోని ప్రభుత్వ వైద్యశాలల ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున నూలివీడుకు పరిసర ప్రాంతాల్లోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న రోడ్లు

రైల్వేకోడూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చాలు కోడూరు రోడ్లు చిత్తడి, చిత్తడిగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షానికే పలు రోడ్లు జలమయం అవుతున్నాయి. గత కొన్ని రోజులుగా రైల్వేకోడూరులో వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న మామిడి మార్కెట్ యార్డులో చిన్నపాటి వర్షానికే బురదమయం అయ్యాయి. దీంతో మామిడి కాయల లోడు చేసుకోవడానికి చాలా ఆటంకంగా మారింది. గేట్ వేలం పాట, మార్కెట్ కమిటీ ద్వారా సెస్ ఆదాయం వస్తున్నా రోడ్ల గురించి పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. మార్కెట్ యార్డు మట్టి రోడ్లు బురదమయం కావడంతో ఇటు రైతులు, అటు వ్యాపారులు ఇక్కట్లు పడుతున్నారు. ఏళ్లతరబడి మామిడి యార్డు దస్థితిలో ఉన్నా పట్టించుకునే నాథుడు లేడని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా రైల్వేకోడూరు పట్టణంలోని పాతబజారు ఎస్ఏఎల్‌సీ పాఠశాల పక్కన, కొత్తబజారు వీధి పోలీస్‌స్టేషన్ వెనుక భాగం, ధర్మాపురం, ఎంపీడీవో ఆఫీసు ప్రభుత్వ పాఠశాల పక్కన, మామిడి యార్డు పక్కన క్రిష్ణదేవాలయం ఆర్చి రోడ్డు వద్ద, రైల్వేస్టేషన్ రోడ్డులో చినుకుపడితే చాలు రోడ్లు జలమయం అవుతున్నాయి. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.





రైల్వేస్టేషన్ రోడ్డు దుస్థితి... గుంతలమయమైన మామిడి కాయల యార్డులోని రోడ్డు

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన

చిన్నమండెం, జూన్2(ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కేవీకే ఊటుకూరు వారి ఆధ్వర్యంలో చిన్నమండెం మండలం కొత్తపల్లి, చాకిబండ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హార్టికల్చర్ కళాశాల నుంచి ముకుంద లక్ష్మి మాట్లాడుతూ మామిడిలో అధిక దిగుబడులకు మొలకువలు, కొమ్మల కత్తిరింపు, పండుఈగ యాజమాన్య పద్దతులపై రైతులకు వివరించారు.

చెట్ల కొమ్మలతో కరెంటు సరఫరాకు నిత్యం అంతరాయం

పెనగలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నాలుగు రెడ్డిపల్లె గ్రామ పంచాయతి పరిధిలో ఉన్న పలు కరెంటు లైన్ల కింద కొమ్మలు బాగా పెరిగిపోవడంతో కరెంటు సరఫరాకు నల్లపురెడ్డిపల్లె గ్రామంలో నిత్యం అంతరాయం కలుగుతుందని గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. గ్రామ పరిధిలో ఒకచోట, మరోచోట అని కాకుండా ప్రతి చోట ఇలాగే ఉంటుందని అంటున్నారు. గాలికి చెట్టు కొమ్మలు ఊగినప్పుడల్లా ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు పోవడం, సిబ్బందికి తెలపడం వారికి తోచినప్పుడు వచ్చి ఫీజులు వేయడం మరలా పోవడం తరచూ జరుగుతున్న తంతుగా మారిందన్నారు. నాలుగు రోజుల కిందట గ్రామంలో జాతర జరిగినప్పుడు నీళ్ల కోసం ప్రజలు పడరాని పాట్లు పడ్డారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి కరెంటు లేక పోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ విషయంపై పెనగలూరు విద్యుత్ ఏఈని వివరణ కోరేందుకు సంప్రదించగా ఆయన స్పందించలేదు.



నల్లపురెడ్డిపల్లె గ్రామ పరిధిలో కరెంటు హైటెన్షన్ లైన్లను తాకుతున్న కంపచెట్లు

జూనియర్ ఇంజనీర్లుగా మార్పు చేయాలి

● ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం ప్రధాన కార్యదర్శి అరవ జయమణి

రాయచోటిటౌన్, జూన్2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న డిప్లమా, బీటెక్ అర్హత కలిగిన ఓ అండ్ ఎం స్టాఫ్‌ను జూనియర్ ఇంజనీర్స్‌గా కన్వర్షన్ చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం ప్రధాన కార్యదర్శి అరవ జయమణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఓ అండ్‌ఎం స్టాఫ్ సుమారు 20 సంవత్సరాల అనుభవంతో పాటు డిప్లొమా, బీటెక్ విద్యార్హతను కలిగి జూనియర్ ఇంజనీర్స్‌గా కన్వనర్షన్ కోసం గత 15 సంవత్సరాలుగా అనేక సార్లు యాజమాన్యాన్ని కలిసి వేడుకొన్నా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అన్ని రకాలుగా అనుభవం, అర్హత కలిగి ఉన్నప్పటికీ జూనియర్ ఇంజనీర్స్‌గా కన్వర్షన్ ఇవ్వలేదని ఆరోపించారు. ఎప్పుడు అడిగినా ఖచ్చితంగా పరీక్ష రాయాలని తెలుపుతున్న యాజమాన్యం, కోర్టుకు వెళ్లిన వారికి మాత్రం జూనియర్ ఇంజనీర్స్‌గా పదోన్నతి కల్పించాలని, డిప్లొమా, బీటెక్ విద్యార్హతను కలిగి ఉన్నప్పటికీ జూనియర్ ఇంజనీర్ కన్వర్షన్ జరగలేదని, ఈ కారణంఆ ఓ అండ్ ఎం స్టాఫ్ తీవ్రమైన మానసిక వేదన అనుభవిస్తున్నారని చెప్పారు. సాధారణంగా ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, డిస్కమ్‌లలో ఇపార్టుమెంట్ టెస్ట్ పెట్టి ఉద్యోగంలో కన్వర్షన్ ఇవ్వడం జరుగుతోందన్నారు. అదేవిధంగా ఓ అండ్ ఎం స్టాఫ్‌కు కూడా కన్వర్షన్ ఇప్పించాలని వారు ప్రభుత్వాన్ని, విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. ఏపీ కాంట్రాక్టు ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు రవీంద్ర, రెడ్డెప్పరెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ నేతలు

వైభవంగా నాగారపమ్మ జాతర



చాందినీ బండి

సంబేపల్లె, జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్నికుంట్ల గ్రామం దండువాండ్లపల్లె సమీపంలో నాగారపమ్మ జాతర సోమవారం రాత్రి గ్రామస్థులు అంగరంగ వైభవంగా చేపట్టారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం విద్యుత్ దీపాలకరణలతో ముస్తాబు చేశారు. పూజారులు అమ్మవారికి అభిషేకాలు, పుట్టబంగారం తెచ్చుట, పొంగుబాటు పెట్టడం, గావు పట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కోరిన కోర్కెలు అమ్మవారి తీర్చడంతో రాయచోటి పట్టణానికి చెందిన మురళి స్కూల్ ఆధ్వర్యంలో అమ్మవారికి విద్యుత్ దీపాలంకరణలతో చాందినీ బండ్లను కట్టారు. ప్రతి ఏడాది అమ్మవారి జాతర గ్రామస్థులు సమిష్టిగా జరుపుకోవడడం విశేషం. జాతర సందర్భంగా గ్రామస్తులతో పాటు రాయచోటి పట్టణానికి చెందిన ప్రజలు అమ్మవారి జాతరలు విశేషంగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూజల్లో పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో నాగారపమ్మ ఆలయం

హస్తకళల అభివృద్ధి చైర్మన్‌కు అభినందన

రాజంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : హస్తకళల అభివృద్ధి చైర్మన్‌గా నియమితులై విజయవాడలో ప్రమాణం చేస్తున్న సందర్భంగా సోమవారం కడపజిల్లాకు చెందిన పలువురు కూటమి నేతలు కలిసి అభినందించారు. జనసేనపార్టీ అన్నమయ్య జిల్లా సమన్వయకర్త అతికారి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ కుడా చైర్మన్ బాలిశెట్టి హరిప్రసాద్, జనేసపార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, కన్వీనర్ జోగినేని మణి, ఎలక్ట్రికల్ రమణ సత్కరించారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

రాజంపేట టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని జడ్పీ గర్ల్స్ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజనం వంట చేసేవారికి కుక్ కం హెల్పర్స్ ట్రైనింగ్‌లో కుకింగ్ కాంపిటీషన్ రాజంపేట ఎంఈవో సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు

యోగా స్థల సేకరణను పరిశీలించిన కడప ఆర్డీవో

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిద్దవటం పురావస్తుశాఖ కోటలో యోగాంధ్ర-2025 జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా సిద్దవటంలో ఈనెల 5న యోగా నిర్వహించడానికి పురావస్తుశాఖ కోటలో గార్డెన్ స్థలాన్ని కడప ఆర్డీవో జాన్‌ఎర్విన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కడప ఆర్డీవో మాట్లాడుతూ జూన్ 5న ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర జిల్లాస్థాయి కార్యక్రమంలో భాగంగా కోట గార్డెన్ స్థలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరు యోగా కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శంకరయ్య, తహసిల్దారు ఎ.తిరుమలబాబు, ఎంపీడీవో ఫణిరాజకుమారి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో కేశవులు పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

రామాపురం, జూన్2(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో రామాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, నగర ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి పట్టాలు ఇస్తూ ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని చెప్పారన్నారు.

కవి సమ్మేళనానికి పసుపులేటి శంకర్‌కు ఆహ్వానం

నందలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా బ్రహ్మంగారిమఠంలోని శ్రీ అచలానంద ఆశ్రమంలో ఈనెల 8వ తేదీన జరగనున్న కవి సమ్మేళనానికి సనాతన ధర్మసారధి బిరుదాంకితులు ఒంటిమిట్ట పోతన సాహిత్యపీఠం అధ్యక్షులు, రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌ను గౌరవ అతిథిగా ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు కేసీ రాజు, గజల్ శ్రీనివాస్, కడప జిల్లా సంచాలకులు బొల్లు రామమోహన్ సంయుక్తంగా ఆహ్వానించారు. గుంటూరులో 2026వ సంవత్సరం జనవరి నెలలో శ్రీ సత్యసాయి స్పిరిట్యూట్ సిటీ మైదానంలో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు స్ఫూర్తిదాయకంగా బ్రహ్మంగారిమఠంలో ఉపోద్ఘాత కవి సమ్మేళనం 500 కవులతో నిర్వహించనున్నారు. తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యాభివృద్ధికి శంకర్ చేస్తున్న కృషిని గుర్తించి గౌరవ అతిథులుగా ఆహ్వానిస్తున్నామని గజల్ శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభల ఉపోద్ఘాత కవి సమ్మేళనానికి తనను గౌరవ అతిథిగా ఆహ్వానించడం సంతోషంగా ఉందని డాక్టర్ శంకర్ తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు

రైల్వేకోడూరురూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం ఆగదని జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే వాటిని కట్టించాలని, ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని కోరారు. ఎటువంటి షరతులు లేకుండా రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మాది మాటల ప్రభుత్వం కాదు : ఎమ్మెల్యే



మహిళకు నీటి బిందె అందిస్తున్న ఎమ్మెల్యే, ముక్కా వికాస్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం' అని రైల్వేకోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మైసూరివారిపల్లి పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో సోమవారం నూతన వాటర్ ప్లాం ట్‌ను టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ముక్కా సాయి వికాష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూడ చైర్మన్ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇటీవల మైసూరివారపల్లి పంచాయతీలో జరిగిన గ్రామ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గ్రామంలో తాగునీటి సమస్యను ప్రస్తావించారు. ఆయన ఆదేశాల ప్రకారం అతి తక్కువ సమయంలో వాటర్ ప్లాంట్‌ను పూర్తి చేసి ప్రజలకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా రామకృష్ణ



రామకృష్ణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంబేపల్లె, జూన్2(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సుంకర రామకృష్ణ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. లక్కిరెడ్డిపల్లె మండలం జాండ్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో సంబేపల్లె మండలం పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కూడా ఈయన పనిచేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా తన సేవలను అందిస్తున్నారు. విద్యారంగానికి విశేష సేవలు అందిస్తున్న ఈయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి తన ప్రధాన లక్ష్యమన్నారు. చదువు పరంగా విద్యార్థుల పురోభివృద్ధికి కృసి చేస్తానన్నారు. ఇప్పటి వరకు సంబేపల్లె హైస్కూల్ అభివృద్ధికి విశేష కృషి చేసిన మడితాటి నరసింహారెడ్డి డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్‌గా వెళ్లడం వలన ఆయన స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణకు పాఠశాల సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయులు రెడ్డెయ్యరెడ్డి, చంద్రశేఖర్‌శెట్టి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాదారులూ.. ఖబడ్దార్...!!

● మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త



మాట్లాడుతున్న సర్పంచ్ సంయుక్త

రైల్వేకోడూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'కబ్జాదారులూ.. ఖబడ్దార్... ఆక్రమణలకు పాల్పడితే ఏ కులం వారైనా శిక్షార్హులేనని మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త హెచ్చరించారు.సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మం డలంలోని మైసూరివారిపల్లె పరిధిలో ఉన్న సర్వే నెంబరు 2085లో వంకపోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని మామిడి మొక్కలు సాగు చేస్తున్న ఓ దళితుడు జనసేన నాయకులపై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు. వంకపోరంబోకు స్థలం ఆక్రమణకు గురవుతున్న సమయంలో తాను, జనసేన నాయకులు తాతంశెట్టినాగేంద్ర, పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్ హైకోర్టులో రిట్‌పిటీషన్ వేశామని గుర్తు చేశారు. వంకపోరంబోకు స్థలాన్ని గ్రామ పంచాయతీకి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగిస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలన్నారు. అసత్యప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. తమ నాయకులపై బుదరజల్లే మాటలు మానుకోవాలన్నారు. దళితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. తమ నాయకులు దళితుడిని తక్కువచేసి మాట్లాడలేదన్నారు. కావాలనే కొందరు సోషల్‌మీడియాలో పార్టీ నాయలకుపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. స్థలం ఆక్రమించిన వ్యక్తి వద్ద రెవెన్యూశాఖ ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1-బీ, అడంగల్ ఉన్నాయా అని ప్రశ్నించారు. ఆక్రమణదారుడికి ఇప్పటికే 5 ఎకరాలు భూమి ఉందన్నారు. జనసేన సీనియర్ నాయకుడు అలం రమేష్ మాట్లాడుతూ తమ పార్టీలో ఉన్న ముసుగు దొంగలపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులకు వంకపోరంబోకు స్థలంపై ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగోలు అమర్‌నాథ్, దళిత నాయకులు బీదం నవీన్‌కుమార్, కనుపర్తి శంకరయ్య, రామ్మూర్తి, ఎన్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మ ఆలయానికి విరాళం

రైల్వేకోడూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లె దళితవాడలో అసంపూర్తిగా మాతమ్మతల్లి ఆలయానిక సోమవారం టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి ముక్కా ఫౌండేషన్ ద్వారా రూ. 1,25,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి అత్యంత ముఖ్యమైందన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలు భక్తిబావంతో మెలగాలన్న ఉద్దేశంలో ముక్కా ఫౌండేషన్ నుంచి సాయం అందించారన్నారు. కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు అండగా ముక్కా ఫౌండేషన్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సమాజ సేవకు ముక్కా ఫౌండేషన్ ఎప్పుడు అండగా ఉంటుందని ముక్కా వరలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని వెంకటరెడ్డిపల్లి పంచాయతీ అరుంధతివాడలో పక్షవాతంతో మంచానికి పరిమితమైన నగిరిపాటి చంద్రమ్మకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రమ్మ ఆర్థిక పరిస్థితిని గమనించి సహాయం అందించినట్లు పేర్కొన్నారు. ముక్కా ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య సమస్యలు, విద్యా అవసరాలు, వృద్ధులకు ఇలా అనేక మందికి ఫౌండేషన్ అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం రేషన్ పంపిణీ చేయాలి



రేషన్ పంపిణీ చేస్తున్న విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎర్రచెరువుపల్లె చౌకదుకాణంలో రేషన్ పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై అధికారులు స్పందించాలి

రైల్వేకోడూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించాలని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబుబ్ చాంద్ తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక అధికారలు ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రైతులకు అవగాహన సదస్సు

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఐ.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సిద్దవటం ఎంపీడీవో సభాభవనంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కోసం ప్రతిరైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వరి, సజ్జ, చిరుధాన్యాలు, సాగు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు విస్తీర్ణం పెంపు ప్రకృతి వ్యవసాయ విధానాలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యత, పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి భరత్‌రెడ్డి, జిల్లా రీసోర్స్ కమిటీ సభ్యులు పద్మజ, శాస్త్రవేత్తలు, మానస, ఖురేషి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

నిత్యపూజస్వామికి హుండీ ద్వారా రూ.1,08,353 ఆదాయం



నిత్యపూజ ఆలయ హుండీ లెక్కింపులో పాల్గొన్న ఎండోమెంట్ సిబ్బంది, స్థానిక పోలీసులు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీలోని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూస్వామి దేవస్థానానికి సంబంధించిన హుండీలను సోమవారం లెక్కించగా రూ.1,08,353 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. స్వామివారి హుండీలో భక్తులు వేసిన కానుకలు ద్వారా మార్చి 28 నుంచి జూన్ 2 వరకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ, ధర్మదాయశాఖ కొండా గంగమ్మ దేవస్థానం, నందిమండలం కార్య నిర్వహణ అధికారి మారుతిప్రసాద్ ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏ.శ్రీధర్ సిద్దవటం పోలీసులు శివప్రసాద్‌రెడ్డి, జ్యోతి వెంకట సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు సుబ్రమణ్యంశర్మ, వంతాటిపల్లె గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం షాపులో సీసీ ఫుటేజీ పరిశీలన



వైన్‌షాపులో సీసీఫుటేజిలను పరిశీలిస్తున్న ఎస్ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట గ్రామ సమీపాన ఉన్న శ్రీకృష్ణ వైన్ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ భాకరాపేట గ్రామ శివారులో ఉన్న శ్రీకృష్ణ వైన్‌షాపును పరిశీలించామన్నారు. అక్కడున్న ప్రొఫైటర్ రామసుబ్బారెడ్డిని విచారించగా మద్యం షాపులో 30 వేలు విలువ గల మద్యం బాటిళ్లు, క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.5 వేల నగదును దొంగలించారన్నారు. దీంతో బ్రాందీషాపులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించామన్నారు. గుర్తు తెలియని వ్యక్తి షాపు ఉన్న తాళాలను పగులగొట్టి మద్యం బాటిళ్ల అట్ట ముఖానికి అడ్డుపెట్టుకుని లోపలికి ప్రవేశించాడన్నారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదుతో పాటు మద్యం బాటిళ్లు తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీలో రికార్డు అయిందని రామసుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి

- నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించిందని, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులన్నీ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్‌టీఏ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులన్నీ సెకండరీ ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఆ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కు (డీఎస్సీ)కి కూడా కేటాయిస్తున్నారనే సమాచారం రావడం బాధాకరమన్నారు. అలాగే మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన ప్రధానోపాధ్యాయుల పోస్టులను వందశాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని కోరారు. ఎన్‌టీఏ ముఖ్య నాయకులు రామాంజులు, పక్కీరా, కులశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఆర్‌వీ రమణ, రాజేంద్రనాయుడు, ఆరీఫుల్లా, వెంకట్రామరాజు, శ్రీనివాసులు, నాగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి: డీఈ

నిమ్మనపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప అన్నారు. సోమవారం ఆయన పది రోజుల క్రితం మండలంలో వేసిన తాగునీటి బోర్లను, మురుగునీటి కాలువలను పరిశీలించారు. అనంతరం అగ్రహారం పంచాయతీలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ పనులను పరిశీలించి త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ మిథున్ చక్రవర్తి, ఎంపీవో గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఎన్నటికో...

- శిలాఫలకానికే పరిమితమైన ఇండోర్ స్టేడియం
- క్రీడాకారులకు తప్పని ఇక్కట్లు
- కార్యరూపం దాల్చని నేతల హామీలు
- మంజూరైన నిధులు రద్దు



పీలేరులో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం శిలాఫలకం వేసిన జూనియర్ కళాశాల క్రీడామైదానం

పీలేరురూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ విద్య, వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి సంతరించుకుంటున్న పీలేరు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం ప్రశ్నార్థకంగా మిగిలింది. అదిగో ఇదిగో అంటూనే దశాబ్దాలు గడిచిపోతున్నా స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో క్రీడాకారులు ఉసూరుమంటున్నారు. క్రీడామైదానాల్లో కనీస వసతులు కానరావడం లేదు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా మౌలిక వసతుల కల్పన ఆమడ దూరంలో ఉండడంతో సర్వత్రా నిరుత్సాహం నెలకొంది. కనీసం క్రీడల నిర్వహణకు అవసరమైన సామగ్రి సైతం అందుబాటులో ఉండడం లేదు. మరోవైపు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సహకారం అంతంత మాత్రంగానే ఉండడం శోచనీయం.

శిలాఫలకానికే పరిమితం...

పీలేరు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం 14 సంవత్సరాలుగా శిలాఫలకానికే పరిమితమైంది. 2011 జూలై 22న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శిలాఫలకం వేశారు. స్టేడియం నిర్మాణానికి రూ.2.10 కోట్లు నిధులు మంజూరు చేశారు. పీలేరుతో పాటు కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురంలో ఇండోర్ స్టేడియాల నిర్మాణం కోసం శిలాఫలకం వేయడంతో పాటు రూ.8.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత క్రీడాకారులు, విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. స్టేడియం నిర్మాణం అదిగో ఇదిగో అంటూనే ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటి వరకూ ఎటువంటి నిర్మాణ పనులు కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. పలుమార్లు స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ అథ్లటిక్ అసోసియేషన్ (శాప్) అధికారులు పీలేరుతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలలోని క్రీడా మైదానాలను పరిశీలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది.

నిర్మాణం పూర్తై ఉంటే...

ఇండోర్ స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చి ఉంటే షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, రన్నింగ్ ట్రాక్, బాల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడల నిర్వహణకు ఎంతో సౌకర్యంగా ఉండేదని క్రీడాకారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఇండోర్ స్టేడియం నిర్మాణంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనవచ్చని సంబరపడ్డారు. అలాగే వీరితో పాటు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు అనేక మంది ఉన్నారు. రన్నింగ్ ట్రాక్ నిర్మాణంతో అథ్లెటిక్స్‌కు ఎంతో దోహదపడేది.

పట్టించుకోని ప్రభుత్వాలు...

అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఇండోర్ స్టేడియం నిర్మాణం గూర్చి పట్టించుకోకపోవడంతో పనులు అటకెక్కాయి. మంజూరైన నిధులు సైతం రద్దు కావడంతో క్రీడాకారులకు కనీస వసతులకు నోచుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా అధికారంలోకి వచ్చిన పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి.

విద్యార్థులకు తప్పని ఇక్కట్లు...

శిలాఫలకాలకే ఇండోర్ స్టేడియాల నిర్మాణం పరిమితం కావడంతో విద్యార్థులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదు. పీలేరు మండలంలో సుమారు 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఐదు గురుకుల పాఠశాలలు, బాలురు, బాలిక జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అయితే పీలేరు మినహా ఎక్కడా ఆశించిన మేరకు క్రీడా మైదానాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు క్రీడాకారులు, విద్యార్థుల ఇక్కట్లు గుర్తించి ఇండోర్ స్టేయాల నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

క్రీడల ప్రాముఖ్యతను గుర్తించాలి



క్రీడల ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మించాలి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మెరుగైన వసతులు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలి. మెరుగైన వసతులు లేనందున ప్రతిభ కలిగిన క్రీడాకారులు నష్టపోయే ప్రమాదం ఉంది.

- చంద్రమౌళి, ఫిజికల్ డైరెక్టర్, పీలేరు

మెరుగైన వసతులు కల్పించాలి



ప్రభుత్వాలు ఏవైనా పేద క్రీడాకారుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని మెరుగైన వసతులు కల్పించాలి. క్రీడల పట్ల ఆశక్తి ఉన్నా వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులతో పాటు క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇండోర్ స్టేడియం నిర్మాణంతో క్రీడాకారులకు ఎంతో ఉపయోగం.

-మస్తాన్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పీలేరు

క్షయవ్యాధి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను క్షయ వ్యాధి రహితంగా రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. టీబీ రహిత భారత్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్‌ను మన జిల్లాలో నేటి నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక దశలోనే టీబీ వ్యాధిని నిరోధించడం, క్షయ వ్యాధి వలన కలిగే మరణాలను తగ్గించడం, 2027 సంవత్సరం నాటికి భారతదేశంలో క్షయవ్యాధిని నిర్మూలించడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

నిక్షయ మిత్ర పథకానికి విరాళాలివ్వండి

టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నుంచి 8 నెలల పాటు పోషకాహారం అందించడానికి నిక్షయ మిత్ర పథకానికి విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. నెలకు రూ.500 నుంచి రూ.700 వరకు, అలా ఆరు నెలలకు రూ.3 వేల నుంచి రూ.4200 వరకు ఒక్కొక్క టీబీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం అందించేందుకు రావాలన్నారు.

ఉదారత చాటుకున్న కలెక్టర్, జేసీ

జిల్లాలో నేటి నుంచి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక్కొక్కరు ముగ్గురు క్షయ వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకొని వారి పోషకాహారం కోసం తమ సొంత నిధుల నుంచి రూ.10 వేలు అందించారు. అలాగే డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు ఒక్కొ క్కరు ఇద్దరు చొప్పున దత్తత తీసుకుని రూ.5 వేలు అందించారు. జిల్లా అధికారులు కూడా స్వచ్ఛంగా ముందుకు వచ్చి తమవంతుగా తోచిన మేరకు ఆర్థిక సహాయం అందించి క్షయ రహిత జిల్లా కోసం కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలికిరి సంతలో దొంగ నోటు



బయటపడ్డ ఐదు వందల నకిలీ నోటు

కలికిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలికిరి సంతలో ఒక ఐదు వందల రూపాయల నకిలీ నోటు చలామణి జరిగింది. అయితే అది పూర్తిగా దొంగనోటు కాదు.. కానీ ఎవరో ఒక మహిళా వ్యాపారికి ఇవ్వడంతో ఆమె మోసపోయింది. అచ్చు ఒరిజినల్ నోటు మాదిరిగానే వుండటంతో చదువురాని ఆ మహిళ సులభంగా మోసానికి గురైంది. సంతలో నన్నారి సోడా బండి పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్న ఒక మహిళ దగ్గర సోడా తాగి రూ.ఐదు వందల నోటు ఇచ్చాడు. దీన్ని మడత పెట్టి ఇవ్వడంతో ఆమె గమనించకోకుండా చిల్లర ఇచ్చేసింది. ఆ తరువాత చూసుకుంటే అది చిన్న పిల్లలు ఆడుకునే నోటుగా తేలింది. దాని మీద చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని స్పష్టంగా వున్నా ఆమె గమనించకుండా మోసపోయింది. విషయం తెలియడంతో అక్కడ జనం పోగయి, మోసగాడి కోసం గాలించారు. అప్పటికే అతడు ఉడాయించడంతో ప్రజలు, వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

'పెన్షనర్లు పే స్లిప్‌లు పరిశీలించుకోవాలి'

కలికిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అయిన ఉద్యోగులు తమ పెన్షన్లకు సంబంధించిన పే స్లిప్పులను పరిశీలించుకోవాలని రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యదర్శి సురేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మే నెలకు సంబంధించిన పేమెంట్ స్లిప్పులు కొత్త విధానంలో జనరేట్ అయ్యాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పలు రకాల వివరాలను పరిశీలించుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన పెన్షన్ స్లిప్పులో పెన్షనరు పేరు, పుట్టిన తేదీ తదితర పలురకాల వివరాలు సక్రమంగా వున్నాయో లేదో బేరీజు వేసుకోవాలని చెప్పారు. వయసు 70 ఏళ్లు దాటిన పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అదనపు క్వాంటమ్ మొత్తం కలిసిందా లేదా అని పరిశీలించాలన్నారు. కమ్యుటేషన్ ఎప్పుడు చెల్లించారు? రికవరీ ప్రారంభ తేదీ వివరాలు కూడా ఈ కొత్త రకం పే స్లిప్పులో పొందుపరిచారని చెప్పారు. గతంలో 2024 నవంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు కమ్యూటేషన్ రికవరీ ఆరు నెలల పాటు నిలుపుదల చేసిన వారందరి నుంచి హైకోర్టు తీర్పు మేరకు 12 వాయిదాలలో తిరిగి రాబట్టుకోవడం ఈ నెల నుంచి ప్రారంభించినట్లు గమనించాలని కోరారు. వారి నుంచి ఈ నెల నుంచి రెగ్యులర్ కమ్యుటేషన్‌తో పాటు రికవరీ వాయిదాలను కలిపి ఈ నెల నుంచి మినహాయిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. భార్యా భర్తలు ఇరువురూ సర్వీసు పెన్షన్ పొందుతున్నట్లయితే ఈహెచ్ఎస్ నెలవారీ చందాను ఒకరికి మాత్రమే మినహాయిస్తే సరిపోతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ స్కేల్ పొందేవారికి డీఆర్ 33.67 శాతం, యూజీసీ స్కేల్ పొందే వారికి 46 శాతం డీఆర్‌లు పేమెంట్ స్లిప్పులో గమినించాలని కోరారు. పెన్షనర్లు ఏ ట్రెజరీ ద్వారా పెన్షన్ పొందుతున్నారో దాని ఎస్‌టీవో యొక్క డీడీవో కోడ్ కూడా నమోదయి వుంటుందని గమనించాలని సురేంద్రరెడ్డి వివరించారు.

'అవినీతి ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలి'

తంబళ్లపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, లంచం లేనిదే పనులు చేయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు గంగరాజు సుధాకర్, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పలు గ్రామాల బాధిత రైతులు ప్లకార్డులతో తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే తప్పుల తడకగా ఉందని, వెంటనే రీ సర్వేను రద్దు చేసి కొత్తగా చేపట్టాలన్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రైతులు చలపతినాయుడు, వెంకట మల్లప్ప, వాసు, నిరంజన్‌రెడ్డి, రమేష్, శ్రీధర్, ఫక్రుల్లా, రమణయ్య వెంకట్రమణ తదితర రైతులు పాల్గొన్నారు.

గాలివీడు డిప్యూటీ తహసీల్దార్‌పై జేసీకి ఫిర్యాదు

- రాయచోటి ఆర్డీవోను విచారణకు ఆదేశించిన జేసీ



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న సుధీర్‌కుమార్

గాలివీడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బోరు బావి తవ్విన పుల్లారెడ్డిగారిసుబ్బారెడ్డి దళిత కుటుంబానికి వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తు బంధు ప్రీతితో వ్యవహరించిన గాలివీడు మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డిపై విచారణ జరిపించి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ ఫిర్యాదు చేశారు. జేసీ స్పందిస్తూ రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులును విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గాలివీడు మండలం చీమలచెరువుపల్లె పంచాయతీ కడపవాండ్లపల్లె దళిత కులానికి చెందిన ధారా వెంకట్రమణకు సర్వే నెంబర్ 973/3లో మూడు ఎకరాలు, సర్వే నెంబర్ 2985/1లో ఒక ఎకరా 14 సెంట్లు వ్యవసాయ సాగు భూమి ఉందని తెలిపారు. వరి భూమి పక్కనే చీమలచెరువుపల్లె పంచాయతీ ఎర్రదొడ్డిపల్లెకు చెందిన పుల్లారెడ్డిగారి సుబ్బారెడ్డికి, వారి బంధువులకు భూమి ఉందని తెలిపారు. అయితే సర్వే నెంబర్ 973/3ను ఆనుకుని 50 సెంట్లు విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి ఉండగా గత 30 సంవత్సరాల క్రితం నుండి ధారా వెంకట్రమణ తయారు చేసుకుని తన అనుభవంలోనికి తెచ్చుకుని చెరువులు నిండిన సందర్భంలో వరి పంటను పెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గత ఆరు నెలల క్రితం వెం కట్రమణ కుమారుడు మానసిక వ్యాధికి గురికావడంతో బెంగళూరులో చికిత్స తీసుకోవడాన్ని ఆసరా చేసుకున్న సుబ్బారెడ్డి ఎటువంటి అనుమతులు లేకుండా దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిలో దౌర్జన్యంగా బోరుబావిని తవ్వాడన్నారు. అంతేగాక వెంకట్రమణ ఏర్పరుచుకున్న హద్దులను సైతం చెరిపేసి అందులోకి వెళ్లనివ్వకుండా బెదిరించాడన్నారు. ఈ విషయమై వెంకట్రమణ గాలివీడు మండల తహసీల్దార్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్లకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గాలివీడు మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డికి, ఆక్రమణదారుడు సుబ్బారెడ్డికి బంధుత్వం ఉన్న నేపథ్యంలో విచారణ పేరుతో ఫీల్డ్‌కు వెళ్లి వెంకట్రమణ ఫిర్యాదును ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వెంకట్రమణ అమ్మ పేరున సర్వే నెంబర్ 2985లో ఉన్న భూమిని సర్వే చేయించి 8 మామిడి చెట్లు సుబ్బారెడ్డికి చెందేవిధంగా నిర్ణయించి దళితులకు అన్యాయం చేశారన్నారు. కావున దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాజేయడానికి కుట్ర పన్నిన సుబ్బారెడ్డి మీద, బంధు ప్రీతితో సుబ్బారెడ్డికి అనుకూలంగా దళితులకు వ్యతిరేకంగా వ్యవహరించి ప్రభుత్వ విధులను దుర్వినియోగ పరిచిన గాలివీడు మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితుడు వెంకట్రమణ, అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ రాబోయేది టీడీపీ ప్రభుత్వమే: ఎమ్మెల్యే నల్లారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగించడంలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ విజయవంతంగా ముందుకెళుతున్నారని ఆయన చెప్పారు. పార్టీకి, ప్రజలకు అంకితభావంతో సేవలు చేసిన వారికి పదవులు వరిస్తాయన్నారు. కలికిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాలతి, వైస్ చైర్మన్‌గా సనావుల్లాతో పాటు మొత్తం పాలకవర్గం సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో జరిగిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా ప్రజల అభిమానాన్ని సంపాదిస్తేనే పదవుల్లోకి వస్తారని, అధికారముండేది పెత్తనం చేయడం కోసం కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ముందుగా చైర్ పర్సన్‌గా మాలతి, వైస్ చైర్మన్‌గా సనావుల్లా, డైరెక్టర్లుగా కలికిరి, కలకడ మండలానికి చెందిన పి.తేజకుమార్, సి.అస్లామ్, బి.వసంత, వీఎస్ మెహర్ బాను, పి.రెడ్డెమ్మ, ఎం.శ్యామల, ఇ.శ్రీనివాస వర్మ, కె.రెడ్డెమ్మ, టి.నరసమ్మ, ఎం.రాజగోపాల్ రెడ్డి, ఎస్.ముబారక్ ఆలీ, ఎస్.విశ్వనాథం శెట్టి, సి.రాంబాబు, సర్పంచు విశ్వనాథ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. పలువురు నాయకులు పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, యోగేష్ రెడ్డి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండల టీడీపీ నాయకులు నౌషద్, జయసూరి, చిట్టి, రవిప్రకాష్ పాల్గొన్నారు.

బయోత్పాతం

- గాడితప్పిన జీవవ్యర్థాల నిర్వహణ
- చెత్తలో కలిపేస్తున్న బయో వేస్టేజీ
- పారిశుధ్య కార్మికుల ప్రాణాలతో చెలగాటం

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాసుల కక్కుర్తితో కొన్ని ఆస్పత్రులు పట్టణవాసుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నాయి. పర్యావరణం ప్రజా ఆరోగ్యం పాలిట ముప్పుగా మారిన జీవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్టేజీ) నిర్వహణ ప్రొద్దుటూరులో దారుణంగా తయారైంది. చెత్తతోపాటు బయో వేస్టేజీని కలిపి మున్సిపల్ కార్మికుల చేతికి అందిస్తున్నారు. బయో వ్యర్థాలపై అవగాహన, దాని ప్రమాదస్థాయి తెలియని అభం, శుభం ఎరుగని పారిశుధ్య కార్మికులు వీటిని సాధారణ చెత్తలో కలిపి తీసుకెళుతున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాలకు చెందిన ప్రైవేటు ఆస్పత్రులలో నెలకొన్న ఈ జాఢ్యంపై అధికారుల క్షేత్ర పరిశీలన లోపించింది.

ప్రొద్దుటూరు పట్టణంలో దాదాపు 130 వరకు చిన్న, పెద్ద క్లీనిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులతోపాటు మెడికల్ ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల నుంచి వెలువడే వేస్టేజీలను తీసుకెళ్లేందుకు ఒక్కో ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్డుకు కొంత డబ్బును బయోవేస్టేజీ సంస్థ వసూలు చేస్తుంది. అయితే బయో వేస్టేజీ తరలించే వాహనాన్ని పరిశీలిస్తే.. సేకరణ అయ్యే వేస్టేజీకి, ఆస్పత్రుల సంఖ్య వాటి నుంచి వెలువడే వ్యర్థాలకు పొంతన లేకుండాపోతోంది. బయో వేస్టేజీ నిర్వహణ సంస్థకు చెల్లించే డబ్బులకు కక్కుర్తిపడో లేక బయోవ్యర్థాలపై నిర్లక్ష్యమో కొంతమంది ఆస్పత్రి నిర్వాహకులు వేస్టేజీలను ఇవ్వకుండా మున్సిపల్ చెత్త తీసుకెళ్లే పారిశుధ్య కార్మికుల చేతికి అందిస్తున్నారు. మున్సిపల్ చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్లలో చెత్తతోపాటు బయో వేస్టేజీలను వాహనంలో పడవేయడంతో డంపింగ్‌యార్డులకు తరలివెళుతోంది. బయో

అవగాహన కల్పిస్తాం...

బయోవ్యర్థాలు మునిసిపల్ చెత్తలో కలిసేందుకు వీల్లేదు. అలాంటి వాటిపై దృష్టి సారిస్తాం. బయోవేస్టేజీపై మునిసిపల్ కార్మికులలో అవగాహన కల్పిస్తాం. సాధారణ చెత్తలో ఈవేస్టేజీ చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

వి. మల్లికార్జున,
మునిసిపల్ కమిషనర్,ప్రొద్దుటూరు.

తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రుల నుంచి వెలువడే బయోవ్యర్థాలను శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్‌కు అందించాలి. బయోవ్యర్థాల నిర్వహణ కచ్చితంగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారి సమాచారం అందిస్తే.. అలాంటి ఆసు పత్రులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

-అనిల్, ఏఈ, ఏపీ పొల్యూషన్
కంట్రోల్ బోర్డు, కడప



వేస్టేజీలలో సుమారు 30 నుంచి 40 శాతం మునిసిపల్ చెత్తలో కలుస్తోందని స్వయంగా కొంత మంది వైద్య రంగానికి చెందిన నిపుణులు చెప్పండం గమనార్హం.

ఆరోగ్యంతో చెలగాటం

జీవ వ్యర్థాలకు సంబంధించిన బట్టలు, మానవ అవయవాలు, సూదులు, ఇతర రకాల బయో వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు పట్టుకోవడం వలన వారికి తెలియకుండానే వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎంత ప్రమాదమో పారిశుధ్య కార్మికులకు అవగాహన లేకపోవడం వలన ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మున్సిపల్ కార్మికులు తెలియకుండానే ప్రాణాలమీదకు తెచ్చుకునే పరిస్థితి కనిపిస్తోంది. మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్మికులకు అసలు బయో వేస్టేజీల వలన ఎదురయ్యే అనేక ప్రమాదాలపై, వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. బయో వేస్టేజీ మున్సిపల్ సాధారణ చెత్తలో కలిపి డంపింగ్‌యార్డుకు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. కాసులకు కక్కుర్తిపడే కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు చూపిస్తున్న అశ్రద్ధ వ్యవహారంపై కాలుష్య నియంత్రణ మండలి నిఘా పెంచి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నిబంధనల ప్రకారం

బయో మెడికల్ వేస్టేజీల నుంచి ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్ వెలువడుతుంది. వీటిని నిర్దేశిత కవర్లలో భద్రపరచి 48 గంటల లోపు కామన్ బయోమెడికల్ వేస్టేజీ ట్రీట్‌మెంట్ ఫెసిలిటి (విచ్చిన్న) కేంద్రాలకు తరలించాలి. ఆంధ్రప్ర దేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందిన అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం దంపెట్ల గ్రామ సమీపంలో శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్ వీటి నిర్వహణ చేపడుతోంది. అక్కడి నుంచి ప్రతిరోజు నాలుగు ప్రత్యేక వాహనాలు ఉమ్మడి కడప జిల్లాలోని కడప, పులివెందుల, రాయ చోటి, రాజంపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు తదితర ప్రాంతాలు తిరుగుతూ ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు, నర్సింగ్‌హోం, డయగ్నోస్టిక్ సెంటర్ల నుంచి బయో వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఈ వేస్టేజీని తీసుకెళ్లేందుకు ఆస్పత్రిలో ఉన్న ఒక్కో బెడ్డుకు కొంత డబ్బులను (పడకల స్థాయిని బట్టి) నెలకు రూ. 2వేలు చొప్పున బయో వేస్టేజీ కోసం ఆయా సంస్థలు వసూలు చేస్తుంటాయి. శ్రీవెన్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్ సంస్థ బయోవేస్టేజీలను తీసుకెళ్లి అక్కడ ప్రభుత్వం నిర్దేశించిన పద్ధతులతో వాటిని నిర్వీర్యం చేస్తారు. తర్వాత బయో వేస్టేజీల వలన ఉత్పన్నం అయ్యే ఎటు వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపించకుండా కట్టడి చర్యలు చేపడుతారు. వ్యర్థాలను వేసి ఉంచేందుకు కావలసిన కవర్లను కూడా ఈ సంస్థే అందిస్తుంది. పసుపు రంగు కవరులో మానవ శరీర అవయవాలు, రక్తంతో కూడిన భాగాలు, ప్రయోగ శాల వ్యర్థాలు... ఎరుపు రంగు కవరులో రక్తంతో ఉన్న సామగ్రి, కాటన్ డ్రెస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, సిరంజీలు, ప్లాస్టిక్ వ్యర్థాలు.. నలుపు రంగు కవరులో కాలం చెల్లిన ఔషధాలు, సూదులు, బ్లేడ్లు, ఇతర పదునైన వస్తువులు.. నేరేడు రంగు కవరులో క్యాన్సర్ కారక మందులు, వీటి వ్యర్థాలు ఉంచి భద్రపరచాలి.



బయో వేస్టేజీ అంటే.....

సాధారణంగా ఆస్పత్రుల నుంచి వచ్చే మాంసపు, శరీర అవయవాలు, రక్తంతో కూడుకున్న భాగాలు, కాటన్, డ్రస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, పనికిరాని, కాలం చెల్లిన ఔషధాలు, వాడి పడేసిన సూదులు, బ్లేడ్లు, తదితరాలను జీవవ్యర్థాలుగా వ్యవహరిస్తుంటారు. వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడవేయకూడదు. వీటి నుంచి ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్, గాలిలోకి చేరుతుంది. 48 గంటల లోపు విచ్ఛిన్న కేంద్రాలకు ఈ వేస్టేజీలను తరలించాలి. వీటిని తాకినా, నేరుగా ముట్టుకున్నా తద్వారా పలు ప్రాణాంతక వ్యాధులకు గురికాకతప్పదు.

ఆసుపత్రిలలో వెలువడే బయోవ్యర్థాలు (నమూనా చిత్రం)

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయభేరి



నిఖిలేశ్వర్‌రెడ్డి, నెల్లూరు 83 పరుగులు



లోహిత్, చిత్తూరు 84 పరుగులు

కడప స్పోర్ట్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 పురుషుల అంతర్‌జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం నెల్లూరు జట్టు కర్నూలు జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో చిత్తూరు జట్టు కడప జట్టుపై విజయం సాధిం చింది. వివరాలిలా.. వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 49.4 ఓవర్లలో 387 పరుగుల భారీస్కోర్ సాధించి ఆలౌట్ అయింది. ఇందులో నిఖిలేశ్వర్‌రెడ్డి 83 పరుగులు, మన్విత్‌రెడ్డి 67, సోహన్‌వర్మ 62 పరుగులు చేసి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. కాగా బౌలింగ్ విభాగంలో కర్నూలు బౌలర్ ఖనిష్ 5 వికెట్లు పడగొట్టాడు. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు కేవలం 26.3 ఓవర్లలో 162 పరుగుల స్వల్ప స్కోర్‌కే అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. ఇందులో ఖనిష్ 60 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో నెల్లూరు బౌలర్ భార్గవ్ 5 వికెట్లు సాధించి నెల్లూరు జట్టుకు భారీ విజయాన్ని అందించారు. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 50 ఓవ ర్లలో 9 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసింది. ఇందులో శివకేశవ 63 పరు గులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 49.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసి విజయభేరి మోగించింది. ఇందులో లోహిత్ 84, నిఖిత్‌గౌడ్ 54 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు.

'చట్టప్రకారం రావాల్సినవి కూటమి సాధించాలి'

వేంపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీపై ఆధారపడి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనుగడ సాగిస్తున్న నేపథ్యంలో చట్టప్రకారం రావాల్సిన విభజన అంశాలు కూటమి ప్రభుత్వం సాధించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికారిప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన జరిగిన 11 సంవత్సరాలు అయిందన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, రూ.5లక్షలకోట్ల మేరకు రాష్ట్రానికి ఆర్థికసాయం చేయడం అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే దురదృష్టవశాత్తు రాష్ట్ర విభజన అనంతరం కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ అధికారంలోకి రావడంతో అమలుకు నోచుకోలేదన్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సింది కొండంత అయితే ఇచ్చింది మాత్రం గోరంత అన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు సత్వర చర్యలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

కడప కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. టీబీ యాక్ట్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపస్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఉన్న షుగర్ వ్యాధిగ్రస్థులు, ఆల్కహాల్, పొగ తాగువారు, పొగాకు ఉత్పత్తులు వాడే వారితో పాటు 60 సంవత్సరాలు పైబడిన వారికి నిర్ధారణ పరీక్షలు తప్పక చేయాలన్నారు. క్షయ అంటు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తగిన జాగ్రత్తలు సూచించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రవి బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎన్ఐఈపీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవదాయ కమిషనరుపై ఎమ్మెల్సీ ఆగ్రహం



దేవదాయ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి

కడప, కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ధూప, దీప నైవేద్యాలకు సంబంధించిన ఫైళ్ల ప్రభుత్వానికి పంపే విషయంలో దేవదాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యంపై ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌కు వచ్చిన ఆయన దేవదాయశాఖ కమిషనరు మురళీతో మాట్లాడుతూ జిల్లాలో గత జనవరి నెలలో పెట్టిన ఫైళ్లను ఇంత వరకు ఉన్న తాధికారులకు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తే ఇంటికి సాగనంపుతానంటూ హెచ్చరించారు. ఏదైనా అర్జీ పెడితే సమాధానం లేదని మండిపడ్డారు. మాలాంటోళ్లకే సక్ర మంగా పలకడం లేదు. సామాన్యులకు ఏం పలుకుతావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఫైళ్లకు వెంటనే సమాధానం లేక పోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇంటి పంపడం ఖాయమని హెచ్చరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ హవా



విద్యార్థులతో నారాయణ కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025 ఫలితాలలో కడప నారాయణ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలిండియా స్థాయిలో డి.సాత్విక 892వ ర్యాంకు, జె.ఐశ్వర్యారాజ్ 1133, బి.వెంకట రామ్‌చరణ్ 1449, టి.రోహిత్‌రెడ్డి 1646, ఎన్.ధనుష్ 1733, సి.ధీరజ్‌కుమార్ 1962, సి.నితిన్‌రెడ్డి 2627, ఎస్.అబ్దుల్ హసీమ్ 3199, పి.ప్రణతిరెడ్డి 4323, బి.జగత్‌స్మరన్ 5704, శ్రావణ్‌కృష్ణ 14701, ఎస్.ఉమర్ ఖైయుమ్ 17356, ఇ.మహమ్మద్ హసన్ 19400 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థుల పట్టుదల తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘన విజయం సాధించామని తెలిపారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, డీన్స్ సుబ్బారావు, బాల వెంకట రెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్స్ మురళీమోహన్, వెంకట స్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్ విద్యార్థులను అభినందించారు.

పోరుమామిళ్ల విద్యార్థికి 112వ ర్యాంక్



పోరుమామిళ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో పోరుమామి ళ్లలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థి సుమన్ సుకుమార్‌రెడ్డి ఆలిండియా ఇంజనీరింగ్ విభాగంలో 112వ ర్యాంక్ సాధించాడని కరస్పాండెంట్ పాండురంగారెడ్డి తెలిపారు. అలాగే శశికుమార్ 1122 ర్యాంక్ సాధించాడని ఆయన తెలిపారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా నూతన అధ్యక్షుడిగా హరికిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న మునగా సతీష్‌కుమార్

కడప మారుతీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగర కో-ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా అనాధ శరణాలయ ప్రాంగణం సాయిసదన్ ఫంక్షన్ హాలులో సోమవారం ఛాంబర్‌ఆఫ్ కామర్స్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా హరికిశోర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్‌గా మేడా జనార్ధన్ రావు, కె.రామమూర్తి (కడప రీజియన్), ఎస్. గోపాలకృష్ణ, శివకుమార్‌రెడ్డి (ప్రొద్దుటూరు రీజియన్), కార్యదర్శిగా మునగా సతీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా పి.వెంకట వంశీకృష్ణనాయుడు (కడప రీజియన్), జాకీర్ అహ్మద్ (ప్రొద్దుటూరు రీజియన్), ట్రెజరర్‌గా కోటా జనార్ధన్‌రావుతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మరో 11 మంది ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ మూడు సంవత్సరాలు కొనసాగుతుంది. నూతన కమిటీకి జిల్లా వ్యాపారులు అభినందనలు తెలిపారు.

గొలుసు దొంగలు అరెస్టు

ప్రొద్దుటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక త్రీటౌన్‌పోలీసు స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడుతూ ప్రొద్దుటూరు టౌన్ బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర రాయల్ కౌంటి వద్ద ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో మే 26 తేదీ గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటనలో మైదుకూరు పట్టణం సరాయిపల్లె రోడ్డుకు చెందిన మర్రిజాషువా, మైదుకూరు టౌన్ సాయినాధపురానికి చెందిన మర్రి జయప్రకాష్‌లను సోమవారం స్థానిక సుందరాచార్యుల వీధిలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి సూమారు 45 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈచోరీ కేసులో దొంగలను పటుకున్నందుకు త్రీటౌన్ ఎస్ఐలు హనుమంతు, వెంకటరెడ్డి, ఎఎస్ఐ సుబ్బన్న, కానిస్టేబుళ్లు, హోంగార్డులను సీఐ అభినందించారు.

మహిళ నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లిన దొంగ

లింగాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన నారే సునీత అనే మహిళకు చెందిన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అపహరించారు. వివరాల్లోకెళితే.... సునీత తన కుమార్తెతో కలిసి గ్రామంలో ఉన్న పోస్టాఫీస్‌కు వెళ్లి డబ్బులు కట్టి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని పరుగెత్తుకెళ్లాడు. అతన్ని పట్టుకునేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా సమీపంలోని కొండలోకి వెళ్లి తప్పించుకున్నాడు. ఆ మేరకు సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలుశిక్ష

బద్వేలు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో పట్టు బడిన ముగ్గురు నిందితులకు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్‌కుమార్ నాలుగురోజుల జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ సత్యనారాయణలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పోట్లదుర్తి పెద్దమ్మ గుడి వద్ద ఉద్రిక్తత



అధికారులతో మాట్లాడుతున్న సీఎం సురేష్‌నాయుడు



ధర్నాకు కూర్చున్న వైసీపీ నాయకులు, తదితరులు

ఎర్రగుంట్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తి పెద్దమ్మ గుడివద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న ప్రహరీ నిర్మాణాన్ని వైసీపీ నాయకులు మరికొందరితో కలసి అడ్డుకున్నారు. ఈ ఆలయాన్ని అభి వృద్ధి చేసేందుకు ఎంపీ సీఎం రమేష్ సుమారు రూ.90లక్షలు మంజూరు చేయించి కలెక్టర్‌తో అనుమతులు ఇప్పించారు. అయితే ఇక్కడి ఆలయానికి సంబంధించి మొత్తం 3.09 ఎకరాల భూమి ఉండగా ఆక్రమణకు గురైందని.. ఆక్రమణలను తొలగించి ప్రహరీ నిర్మించాలని వైసీపీకి చెందిన సుధాకర్‌రెడ్డి, మరికొందరు సోమవారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా అడ్డుకున్నారు. సీఎం సురేష్‌నాయుడు పెద్దమ్మ ఆలయంలో తన వర్గీయులతో కలిసి కూర్చున్నారు. అదే సమయంలో వైసీపీకి చెందిన సుధాకర్‌రెడ్డి ఆలయంలోకి వెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి తోపులాట జరిగింది. అరుపులు, కేకలతో ఘర్షణ వాతా వరణం నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వరప్రసాద్‌రెడ్డి ఆలయంలో ఉన్న సురేష్ నాయుడు వర్గీయులపై ఇటుకతో విసిరినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సురేష్ నాయుడు వర్గీయులు ఆగ్రహించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని పంపి వేశారు. కాగా, ఆలయం వద్ద పనులు మాత్రం జరుగుతూనే ఉన్నాయి. అయితే సాయంత్రం 3.50 గంటలకు ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయని, పనులు నిలిపివేయాలని అధికారులు పేర్కొనడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. కాగా, గ్రామంలో రాత్రి వరకు ఉద్రిక్తంగానే ఉంది. సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవిషయంపై జిల్లా ఎస్పీకి సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీటీ యామిని ఆలయం వద్దకు వెళ్లి ఇరువర్గాల వారితో మాట్లాడినా ఎలాంటి ప్రయోజనం లేదు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు

- జగన్ దేవాదాయశాఖ, ఈవో

పోట్లదుర్తి హనుమనగుత్తి రోడ్డులోని పెద్దమ్మ గుడికి సర్వే నెంబరు 657లో 3.09ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 50 ఏళ్ల క్రితమే కొంత ఆక్రమణకు గురైంది. వారందరికి నోటీసులు ఇచ్చాము. వారు కూడా కోర్టుకెళ్లి లాయర్ నోటీసులు ఇప్పించారు. ప్రస్తుతం ఉన్న భూమిలో అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపీ సీఎం రమేష్ రూ.90లక్షలు నిధులు కలెక్టర్ ద్వారా కేటాయించారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ఆగిపోయాయి. అనంతరం కోర్టు ఉత్తర్వులు మేరకు విజయవాడ దేవదాయ కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో ఇక్కడ పనులు మళ్లీ మొదలు పెట్టాము. అయితే ఆక్రమణలు తొలగించిన తర్వాతనే పనులు మొదలు పెట్టాలని కొందరు ధర్నా చేస్తున్నారు.

రేపు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

వాల్మీకిపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 4వ తేదీ బుధవారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని, నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యోగాసనాలతో ఆరోగ్యం

నిమ్మనపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యోగాసనాలతో పలు ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మట్లాడుతూ నేటి నుండి ప్రతి గ్రామ పంచాయతీలోనూ ప్రజలు యోగాసనాలు నేర్చుకోవాలని తెలిపారు. యోగా చేయడం వల్ల మనస్సు, శరీరాన్ని అనుసంధానించే ఒక పురాతన కళ అని, ఉదయం గంట పాటు యోగాసనాలు చేయాలని తెలిపారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేద్దాం

● వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు ● ప్రజల సహకారంతో టీబీ అంతం

మదనపల్లె అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేయాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయ పాలనాధికారి రాఘవేంద్ర, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ నూరు రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో టీబీ కేసులను గుర్తించడం, మరణాలను తగ్గించడం, కొత్త కేసులను గుర్తించడం ప్రధాన లక్ష్యంగా పని చేయాలన్నారు. గళ్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ వ్యాధి లక్షణాలను గమనించి వారిని గుర్తించాలన్నారు. చికిత్స సమయంలో రోగి ఖాతాలో వెయ్యి రూపాయలను జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షలకులు ప్రభాకర్, నాగారెడ్డి, దయాలన్, సబ్ యూనిట్ ఆఫీసర్ కలీల్, మదనపల్లె యూనిట్ సిబ్బంది శాంతి, వనజకుమారి, సుశీల, తరుణ్, సునీత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించాలి

వాల్మీకిపురం, జూన్ 2: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి డాక్టర్ సోని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ వందరోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆసిఫ్, శివాణి, జ్ఞానేశ్వర్, హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువులో వైద్య సిబ్బంది ర్యాలీ

ములకలచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో సోమవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధుల్లో అవగాహన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రేష్మాబేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజం కోసం పాటుపడాలి

తంబళ్లపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తేజస్విని పిలుపునిచ్చారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం టీబీ సూపర్‌వైజర్ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు అమరసింహరాజు, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ల్యాబ్ టెక్నీషియన్ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



కలకడలో మానవహారంగా ఏర్పడిన వైద్యులు, ప్రజలు

ప్రజల సహకారంతో టీబీ వ్యాధి అంతం

కలకడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో క్షయవ్యాధిని సమూలంగా అంతం చేయవచ్చునన్ని డాక్టర్లు కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు అన్నారు. టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రజలతో కలిసి పాపిరెడ్డిగారిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ రోగి దగ్గు, తుమ్మిన తుంపర్లు గాలిలో కలిసి ఇతరులకు సోకుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు కోల్పోవడం, ఆకలి కాకపోవడం వంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. అనంతరం మానవహారం చేసి ప్రతిజ్ఞ చేశారు.



మదనపల్లె, ములకలచెరువులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్య జాగ్రత్తలతో క్షయ వ్యాధి నివారణ

గుర్రంకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం వల్ల క్షయ వ్యాధిని నివారించవచ్చునన్ని డాక్టర్ భానుప్రకాశ్ అన్నారు. సోమవారం గుర్రంకొండలో 104 వాహనం ద్వారా రోగులకు వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయ మవుతుందన్నారు. కార్యక్ర మంలో సిబ్బంది సీతారా మయ్య, జయలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజల కోసమే రేషన్ పంపిణీలో మార్పులు

వాల్మీకిపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యం కోసమే రేషన్ పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుట్టిందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళీ అన్నారు. సోమవారం వాల్మీకిపురం పట్టణంలోని చౌకదుకాణాలలో ఆయన టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు పీవీ నారాయణ, టమోటా రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పాలేటి గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పిలి గ్రామంలో పాలేటి గంగమ్మ విగ్రహప్రతిష్ఠ చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామస్థులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అందరూ కలిసి మెలసి జీవించాలని కోరారు. కార్యక్రమంలో బండి ఆనంద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట

● మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి



ర్యాలీలో జనంతో కలసి వస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి.. ప్రమాణ స్వీకారం చేస్తున్న పురం రామ్మూర్తి

పీలేరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనలో మనకు అసూయ అవసం లేదని, దశలవారీగా అందరికీ పదవులు వస్తాయని తెలిపారు. నిరుపేదల ఆకలి తీర్చడం కోసం త్వరలోనే పీలేరులో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. పీలేరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం రైతులు, వ్యాపారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గూడు లేని పేదలందరికీ త్వరలోనే ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. ముందుగా ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పీలేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి భారీ సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు తరలివచ్చారు. అనంతరం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పురం రామ్మూర్తి, వైస్ ఛైర్మన్‌గా సురేంద్రారెడ్డిలతో ఏడీ త్యాగరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం డైరెక్టర్లుగా ఎన్.సుబ్బయ్య, ఎం.కృష్ణమూర్తి, పి.రహంతుల్లా, ఎస్ శివమ్మ, ఓ.రమాదేవి, ఎం.సాధన, ఎన్.అమరనాథరెడ్డి, కె.రవి, గోళ్ల కిశోర్‌నాయుడు, ఎం.రజనీశ్రీ, ఎ.వనిత, టి.లక్ష్మీకాంతమ్మ, జి.అనురాధ, బి.నారాయణమూర్తిలతో సామూహికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలక వర్గానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాష్ నాయుడు, మార్కెట్ కమిటీ చేర్మన్ పురం రామ్మూర్తి, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చేనేత అభివృద్ధి అధికారి ప్రవీణ్‌రాజు సూచించారు. సోమవారం కోన పంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి సులభంగా రుణాలు పొందే అవకాశముందన్నారు. అలాగే వర్క్‌షెడ్‌ల నిర్మాణాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు గురుస్వామి, రామకృష్ణ, బాలయ్య, వెంకటరత్నం, నాగవేణి పాల్గొన్నారు.

అలరించిన మహాభారత నాటకాలు

మదనపల్లె అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గత పదిరోజులుగా మదనపల్లె పట్టణం టిప్పు సుల్తాన్ మైదానంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో రాత్రి నాటకాలు అలరించాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి దుర్యోదుని వేషధారణ, తదితర పాత్రలు భక్తులను ఆకట్టుకున్నాయి. వెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో ఈ నాటకాలు నిర్వహిస్తున్నారు.

బ్రహోత్సవాలకు అంకురార్పణ

కలికిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రారంభం కానున్న 11 రోజుల బ్రహ్మోత్సవాలకు సోమవారం రాత్రి అంకురార్పణ జరిగింది. ఉదయం తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు. అంకురార్పణ కోసం పుట్టమన్ను సేకరణను పూర్తి చేశారు. వేద మంత్రాల పారాయణంతో, ఆగమ శాస్త్ర సాంప్రదాయాల ప్రకారం రాత్రి అంకురార్పణ జరిగింది. మంగళవారం ఉదయం యథాతథంగా తిరుమంజన కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం రాత్రికి పల్లకీ సేవను ఏర్పాటు చేస్తున్నారు.



అంకురార్పణకు పుట్టమన్ను తీసుకువస్తున్న వేదపండితులు

పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయండి : ఎంపీడీవో

పెద్దమండ్యం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) ఎన్టీఆర్ పక్కాగృహాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జీఎస్ ఇంజనీరు అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు డబ్బులు పొందిన లబ్ధిదారులు తప్పకుండా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. లేఅవుట్‌లల్లో మొక్కలు నాటే కార్యక్రమం త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 12న ఎన్టీఆర్ పక్కా గృహాల ప్రవేశ కార్యక్రమాలు వైభవంగా జరగనున్నట్లు తెలిపారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

పెద్దతిప్పసముద్రం జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీటీఎంలో సోమవారం స్థానిక వైసీపీ ఎంపీపీ మహమూద్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 4న అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాదిక్, డ్రిప్ రమణ, హరి, ఓబులేసు, అప్జల్, నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా జనసేన నేత జన్మదిన వేడుక

మదనపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బసినికొండ జనసేన నేత పులగంటి నాగేంద్ర జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పార్టీశ్రేణులకు పంచిపెట్టారు. టీడీపీ, జనసేన నాయకులు పులగంటి నటశేఖర్, ఆర్.వెంకటరమణనాయుడు, దేవుడు రమేష్, కంచర్ల రంగస్వామినాయుడు, వైజీకే రమేష్, రాటకొండ సుధాకర్‌నాయుడు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ వెంకటరమణ, తదితరులు పాల్గొని నాగేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



జనసేన నేత నాగేంద్ర జన్మదిన వేడుకల్లో పార్టీశ్రేణులు

సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

● తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీపీఐ ధర్నా

మదనపల్లె టౌన్, జూన్ 2: మదనపల్లె పట్టణంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పట్టణంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదన్నారు. మదనపల్లె ప్రజలకు ఇచ్చిన హామీల్లో మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని, బీటీ కళాశాలను యూనివర్శిటీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రిని పీ4 విధానంలో అమలు చేయాలని చూస్తే ఉద్యమాలు చేస్తామన్నారు. అనంతరం డీఏవో రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, సూర్యనారాయణ, దేవా, తిరుమల, మస్తాన్, వాసు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ములకలచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప మాట్లాడుతూ పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర, నరసింహులు, నాగయ్య, సాంబశివ, వేమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలుపుకోవాలి

బి.కొత్తకోట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే పేదలకు 2సెంట్ల ఇంటిస్థలం, రూ.4లక్షలు ఇస్తామన్న హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుపుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని సర్వేనెంబరు 1868-2, 3లలో ప్రభుత్వం 42మంది పేదలకు 2013లోనే పట్టాలిచ్చి, స్థలాలు చూపకపోవడంతో కబ్జాదారులు దానిపై కన్నేశారని ఆరోపించారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రఘునాథ్, నారాయణస్వామి, మంజునాథ్, రామాంజి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



చెక్కును అందజేస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం మండలాలకు చెందిన ముగ్గురికి రూ.2.55 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో సమస్యల వెల్లువ

మదనపల్లె టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో రాఘవేంద్ర ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పలువురు వినతిపత్రాలు అందజేశారు. మదనపల్లె టమోటా మార్కెట్ ఎదుట నిత్యం ట్రాఫిక్ సమస్య వస్తోందని, అధికారులు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు విన్నవించారు. పట్టణ నడిబొడ్డున మార్కెట్ యార్డు వుండటం వలన, అలాగే సీజన్‌లో టమోటా విక్రయానికి వచ్చే ట్రాక్టర్లు, లారీలతో ట్రాఫిక్ సమస్య వస్తోందన్నారు. అలాగే పట్టణంలోని సీటీఎం రోడ్డులోని చేపల మార్కెట్ వలన దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, చేపల మార్కెట్‌ను పట్టణ శివారులోకి తరలించాలని కోరారు. మదనపల్లె పట్టణంతో పాటు, మండలంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠ్య పుస్తకాల పేరిట దోచుకుంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ డీఏవోకు ఫిర్యాదు చేశారు. గిరిజనుల అభివృద్ధికి సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను మదనపల్లెలో ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెలో ఉపాధిహామీ కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదని కూలీలు వినతిపత్రం ఇచ్చారు.

ములకలచెరువు విద్యార్థికి ఐఐటీ జేఈఈలో 1372 ర్యాంకు



యాషికరెడ్డి

ములకలచెరువు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ములకలచెరువుకు చెందిన ఉపాధ్యాయులు అమరనాథరెడ్డి, నీరజ దంపతుల కుమార్తె యాషికరెడ్డి ఐఐటీ జేఈఈలో అడ్వాన్స్ ఆల్ ఇండియా ఫలితాల్లో 1372 ర్యాంకు సాధించింది. అలాగే 14లక్షల మంది రాసిన జేఈఈ మెయిన్స్‌లో 2833వ ర్యాంకు, ఇంటర్మీడియట్ గ్రూపుల్లో 100 శాతం మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని యాషికరెడ్డిని అడ్వకేట్ లక్ష్మీకాంత్, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మదనపల్లె విద్యార్థులకు ర్యాంకులు

మదనపల్లె అర్బన్, జూన్2(ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టు ఏజన్సీ ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఐఐటీ 2025 ఫలితాల్లో వెంకటరెడ్డి శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు రెండు స్థానాలను కైవసం చేసుకున్నారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. మదనపల్లెకు చెందిన హెచ్ఎంలు పి.చిట్టిబాబు, ఎ.అపర్ణదేవిల కుమార్తె పి.దేదీప్య సాయి 736 ఆల్ ఇండియా ర్యాంకు, పట్టణంలో జనల్‌స్టోర్ నిర్వహించే జగదీష్, స్వాతిల కుమార్తె బి.తనుశ్రీ 2413 ర్యాంకును సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి విద్యార్థినులను, ఉపాధ్యాయులను అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి